ప్రజాశక్తి

బుధవారం 22 అక్టోబర్ 2025 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

అభివృద్ధిలో ఎక్కడున్నాం..?

- రైస్ కార్డులు 6.61 లక్షలు..
- జిల్లాలో ఉన్న మొత్తం ఇళ్లు 5.65 లక్షలు



ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

దారిద్ర్యపురేఖకు దిగువనున్న కుటుంబాలకు ఆహార భద్రత కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పౌర సరఫరాల శాఖ ద్వారా తక్కువ ధరలకు నిత్యావసరాలు అందిస్తోంది. ఇందుకోసం కొన్ని నియమ నిబంధనలను కూడా రూపొందించారు. ఎప్పటినుంచో సబ్సిడీలపై నిత్యావసరాలను రేషన్‌దుకాణాల ద్వారా అందిస్తోంది. ఈ ప్రక్రియ చాలా ఏళ్ల క్రితం నుంచే మొదలైంది. అయితే రేషన్ కార్డులు పొందే వారంతా పేదలే.. వారంతా చాలీచాలని వేతనాలతో జీవనం గడుపుతున్నట్లు భావించాల్సిందే.. నిజం కూడా.. అయితే నిత్యావసరాల కోసమే కాకుండా అన్ని ప్రభుత్వ సౌకర్యాల కోసం రేషన్‌కార్డును ప్రామాణికంగా తీసుకోవడంతో కొందరు వాటి కోసం ఏదోరూపంలో లాలూచీలు పడి కార్డులు పొందారు. కొద్దిమందికే ఇప్పుడు రేషన్ కార్డులు (రైస్ కార్డులు) లేవు. ఉద్యోగులకు ఈ సౌకర్యం లేనందున జారీ చేయలేదు. ఈ విధంగా జిల్లాలో ఉన్న కుటుంబాలకంటే రేషన్‌కార్డులు ఎక్కువగా ఉన్నాయి. దీన్ని బట్టి మనం ఎక్కడున్నామనేదీ విశ్లేషించాలి. జిల్లాలో ప్రస్తుతం 5,65,663 గృహాలుండగా అందులో గ్రామీణ ప్రాంతాల్లో 4,58,246 ఇళ్లు ఉన్నాయి. పట్టణాల్లో 1,07,417 ఇళ్లు ఉన్నాయి. ఇంటికొక రేషన్‌కార్డును మంజూరు చేశారు. రేషన్‌కార్డులు ప్రస్తుతం 6,61,141 ఉన్నాయి. అంటే ఇళ్ల యజమానులకు మించి రేషన్‌కార్డులున్నాయి. ఏదేమైనా అద్దె ఇళ్లలో ఉండే పేదలను మినహాయిస్తే అద్దె ఇళ్లలో రేషన్‌కార్డులకు అర్హులు తక్కువే. జిల్లాలో ఉన్న గృహాలకంటే లక్షకుపైగా అదనంగా రేషన్‌కార్డులున్నాయి. ఇంకా అర్హులైన పేదలు కార్డుల కోసం ధరఖాస్తులు పెడుతూనే ఉన్నారు. జిల్లాలో ఉన్న తెల్లకార్డుల సంఖ్యను బట్టి మన జీవనపరిస్థితి ఏ స్థాయిలో ఉందో విదితమవుతోంది.

రెయిన్ అలర్ట్

- నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం
- నేటి నుంచి విస్తారంగా కురియనున్న వర్షాలు
- మత్స్యకారులు ఎవరూ వేటకు వెళ్లొద్దు
- అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశాలు



మంగళవారం నాడు కురిసిన వర్షం కారణంగా కొనకనమిట్లలో పొగాకు పంటలో నిలిచిన నీరు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

నైరుతి బంగాళాఖాతంలో తీవ్రమైన అల్పపీడనం ఏర్పడింది. ఈ అల్పపీడనం పశ్చిమ వాయువ్యంగా కదిలి రానున్న 36 గంటలలో వాయుగుండంగా మారే అవకాశం ఉంది. వాతావరణ శాస్త్రవేత్తలు తెలియజేశారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేశారు. బుధవారం రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలుకురిసే అవకాశం ఉందని, ఆరెంజ్ అలర్ట్ జారీ చేయనున్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

అల్పపీడనం కారణంగా ప్రకాశం జిల్లా వ్యాప్తంగా మంగళవారం మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. కురుస్తున్న వర్షాలతో ప్రజలు, విద్యార్థులు నానా ఇబ్బందులు పడ్డారు. మంగళవారం సిఎస్‌పురం, రాచర్ల, కంభం, వెలిగండ్ల, పామూరు, హెచ్‌ఎంపాడు, బేస్తవారపేట, పొదిలి, ఒంగోలు రూరల్, ఒంగోలు అర్ధవీడు, అర్బన్, అర్ధవీడు, పిసిపల్లి, కొమరోలు, కొత్తపట్నం మండలాలలో వర్షం కురిసింది. ఒంగోలు నగరంలో ఉదయం 8 గంటల నుంచి 9.30 గంటల వరకు కురిసిన వర్షానికి నగర వీధులు చెరువులను తలపించాయి. ఒంగోలు నగరంలో 17.8 మిల్లీమీటర్ల వర్షం కురియటం విశేషం. ప్రధాన రహదారులలో కాల్వలు పొంగి పొర్లాయి.

మత్స్యకారులు వేట వెళ్ళొద్దు

జిల్లాలో కొత్తపట్నం, నాగులుప్పలపాడు, సింగరాయకొండ మండలాలలో తుపాన్ సన్నద్ధతపై అధికారులు చర్యలు చేపట్టారు. ఆయా ప్రాంతాల పరిధిలోని మత్స్యకారులు ఎవరూ సముద్రంలోకి వేటకు వెళ్ళవద్దని అధికారులు హెచ్చరించారు. కొత్తపట్నం మండలం ఈతముక్కల గ్రామంలో జిల్లా పంచాయతీ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, జడ్పీ సిఇఒ బి.చిరంజీవి ▶ 2లో



బాపట్లలో ట్రంప్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

అమెరికా సుంకాలకు నిరసనగా..

ట్రంప్ దిష్టిబొమ్మ దహనం

▶ 4లో



కలెక్టరేట్ వద్ద మీడియాతో మాట్లాడుతున్న మత్స్యకారులు

పోలీసు అమరవీరుల కుటుంబాలకు

అండగా ఉంటాం..

- మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి
- ఘనంగా పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం
- భారీవర్షంలోనూ ఘన నివాళి

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

పోలీస్ అమరవీరుల కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి పేర్కొన్నారు. అక్టోబర్ 21న పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరులకు ఒంగోలులోని జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీస్ అమరవీరుల స్థూపం వద్ద మంత్రితో పాటు కలెక్టర్ రాజాబాబు, ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు, ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులు ఘనంగా నివాళులు అర్పించి పుష్పాంజలి ఘటించారు. పెరేడ్ మైదానంలో అమరవీరుల స్థూపం వద్ద స్మృతి పరేడ్ ఘనంగా నిర్వహించారు. అమరవీరుల సంస్మరణ దినోత్సవం జరుగుతున్న సమయంలో ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. అయినప్పటికీ మంత్రి, కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా అమరవీరులకు ▶ 2లో



వర్షంలోనూ అమరవీరులకు నివాళులర్పిస్తున్న మంత్రి, కలెక్టర్, ఎస్పీ

స్ట్రెయిట్‌కట్ కాలువను

పునరుద్ధరించాలి

- కాలువలో ఉన్న రాళ్లను తొలగించాలి
- డికె పట్టాని రద్దుచేయాలి..
- కలెక్టరేట్ వద్ద మత్స్యకారుల డిమాండ్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఈపురుపాలెం స్ట్రెయిట్ కట్ కాలువను తక్షణమే పునరుద్ధరించాలని, కాలువలో ఉన్న రాళ్ళను తొలగించి బుర్ల వెంకట్రావుకు ఇచ్చిన డికె పట్టాని రద్దు చేయాలని జిల్లా కలెక్టరేట్ వద్ద మత్స్యకారులు డిమాండ్ చేశారు. జిల్లాలోని వాడరేవు తీరప్రాంత గ్రామాల మత్స్యకారుల ప్రతినిధులు మంగళవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్‌ను కలిశారు. బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడన ప్రభావం కారణంగా సముద్రంలో వేట నిలిపివేశారని చెప్పారు. తమ బోట్లను ఈపురుపాలెం స్ట్రెయిట్‌కట్ కాలువను పెట్టుకునే వీలులేకపోయిందన్నారు. కాలువ అంచుల్లో ఉన్న రాళ్లను ఢీకొని తమ బోట్లు పగిలాయని, తుపాను సమయంలో బోట్లు ఎక్కడ పెట్టుకోవాలో అర్థం కాక ఇబ్బందులు పడుతున్నామని మత్స్యకారులు జిల్లా కలెక్టర్ ముందు తమ గోడు వెళ్లబోసుకున్నారు. అయితే కలెక్టర్‌ను కలిసి బయటకు వచ్చిన మత్స్యకారుల ప్రతినిధులు మీడియా ముందు తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు. గడిచిన ▶ 2లో

రెయిన్ అలర్ట్

(మొదటిపేజీ తరువాయి)

పర్యటించారు.

విపత్తును ఎదుర్కొనేందుకు సిద్ధం

కలెక్టర్ రాజాబాబు ఆదేశం

భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించటంతో ఎలాంటి పరిస్థితి ఎదురైనా సమర్థంగా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు. బుధ వారం నుంచి జిల్లావ్యాప్తంగా ఈదురుగాలు, వర్షాలు కురుస్తాయని సమాచారం రావటంతో జిల్లాస్థాయి అధికారులతో ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్

భారీ వర్షాల హెచ్చరిక దష్ట్యా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రకాశం భవనంలో 1077 టోల్ ఫ్రీ నంబరుతో కమాండ్ కంట్రోల్ రూమ్‌ను అధికారులు ఏర్పాటు చేశారు. 24 గంటలూ పనిచేసేలా ఏర్పాటుచేసిన ఈ కంట్రోల్ రూమ్‌లో విద్యుత్, ఆర్‌డబ్ల్యుఎస్, పోలీస్, వైద్య, రెవిన్యూ, పశుసంవర్ధక శాఖలకు చెందిన సిబ్బందికి విడతల వారీగా విధులు కేటాయించారు.

జిల్లాలో 8.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

జిల్లాలో 8.7 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జిల్లాలోని 38 మండలాలలో 31 మండలాల్లో వర్షం కురిసింది.. సిఎస్‌పురంలో 32.4 మిల్లీమీటర్లు, కంభంలో 21.4, పామూరులో 18.6, వెలిగండ్లలో 18, ఒంగోలు రూరల్ 17.8, ఒంగోలు అర్బన్ 17.8, హెచ్‌ఎంపాడులో 17, రాచర్లలో 16.8, బేస్తవారపేటలో 16,2, కొత్తపట్నం 15.4, పొదిలిలో 13.8, పిసిపల్లిలో 13.4, కొమరోలులో 10.8, అర్ధవీడులో 10.4, తర్లుపాడులో 9.8, పొన్నలూరులో 9.4, చీమకుర్తిలో 8.2, నాగులు ప్పలపాడులో 7.8, కొండపిలో 7.2, త్రిపురాంతకంలో 6.8, సింగరాయకొండలో 6.4, మద్దిపాడులో 6.2, టంగుటూరులో 6, కనిగిరిలో 5.8, కొనకనమిట్లలో 5, జరుగుమల్లిలో 5, సంతనూతలపాడులో 4.6, మర్రిపూడిలో 4.4, మార్కాపురంలో 2.6, గిద్దలూరులో 2.2, పెద్దారవీడులో 1.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

ఒంగోలు రిటైల్ కెమిస్ట్స్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్

ప్రధాన కార్యదర్శిగా కూరపాటి సత్యనారాయణ

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

ఒంగోలు రిటైల్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా కూరపాటి సత్యనారాయణ సోమవారం ఎన్నికయ్యారు. వేమూరి సుబ్బారావు మరియు కూరపాటి సత్యనారాయణ ప్రధాన కార్యదర్శి పదవికి పోటీచేశారు. ఇద్దరికీ సమానంగా 109 ఓట్లు రావడంతో ఫలితాల ప్రకటనను ఎన్నికల అధికారులు రెండు రోజుల పాటు వాయిదా వేశారు. అనంతరం సోమవారం అసోసియేషన్ అధ్యక్షుడు వెంకారెడ్డి, కోశాధికారి ఏడు కొండలు, సీనియర్ కెమిస్టులు రంగనాయకుల మెడికల్స్ చిన్న, మధు కిరణ్ మెడికల్స్ కొల్లా మధు సమక్షంలో అధికారులు, అభ్యర్థులతో సమావేశమై పరస్పర అంగీకారంతో పదవిని ఆరు నెలల చొప్పున విభజించుకోవాలని నిర్ణయించారు. మొదటి ఆరునెలలు కూరపాటి సత్యనారాయణ, తదుపరి విడతలో వేమూరి సుబ్బారావు బాధ్యతలు చేపట్ట నున్నారు.ఈ సందర్భంగా సత్య నారాయణ మాట్లాడుతూ అసోసి యేషన్ ఐక్యతను కాపాడుకుంటూ ఫార్మసీ రంగ అభివద్ధికి కషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎన్నికల నిర్వహణలో కీలక పాత్ర పోషించిన అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు సిసికెఆర్. రెడ్డి, వ్యవస్థాపక అధ్యక్షుడు డి. కిష్టారెడ్డి, టౌన్ అధ్యక్షుడు వెంకారెడ్డి, కోశాధికారి వి. ఏడు కొండలు, టౌన్ ఇసి సభ్యులు పాల్గొన్నారు. ఎన్నికలకు ప్రధాన ఎన్నికల అధికారిగా ప్రగతి మెడికల్స్ రామయ్య, మాధురి మెడికల్స్ టి. మధుసూదన్ రెడ్డి, మహాలక్ష్మి మెడికల్స్ ఎం. వెంకటేశ్వర్లు వ్యవహారించారు.



సత్యనారాణను అభినందిస్తున్న నాయకులు



వాలీబాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

వాలీబాల్ జట్లు ఎంపిక

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14, 17 విభాగాల్లో బాల, బాలికల జిల్లా జట్లకు ఎంపికలు మంగళవారం నిర్వహించారు. ఈ ఎంపికలో మార్కాపురం డివిజన్‌లో మండల స్థాయిలో ఎంపిక కాబడిన 300 మంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం ఉప విద్యాశాఖ అధికారి మామిళ్ళపల్లి శ్రీనివాసరెడ్డి, ఎంఇఒ-1 బి.రాందాస్ నాయక్, ఎంఇఒ-2 కె.శార్వాణి, స్థానిక జడ్‌పి బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మునగాల చంద్రశేఖర్‌రెడ్డి, డివిజన్ కో ఆర్డినేటర్లు పి.దామోదర్‌రెడ్డి, చెంచయ్య నాయుడు, వివిధ పాఠశాలలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులుపాల్గొన్నారు.

స్ట్రైయిట్‌కట్ కాలువను పునరుద్ధరించాలి

(మొదటిపేజీ తరువాయి)

ఆరు నెలలుగా తాము స్ట్రైయిట్‌కట్ కాలువను పునరుద్ధరించాలని కోరుతూ న్యాయం కోసం పోరాడుతున్నామని పేర్కొన్నారు. ఈ నెల 1న కలెక్టరేట్ వద్ద ధర్నా చేశామని, 3వ తేదీన చీరాల ఆర్‌డివోగా కార్యాలయంలో జరిగిన సమావేశంలో జిల్లా కలెక్టర్ తమకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. కానీ కనీసం కాలువలో రాళ్ళు తొలగించే పని కూడా జరగలేదని, ఇప్పుడు బుర్ల వెంకట్రావు కోర్టుకు వెళ్లారు.. స్టే వచ్చింది అని చెబుతున్నారని పేర్కొన్నారు. గత కలెక్టర్ చెప్పిన మాటనే ప్రస్తుత కలెక్టర్ కూడా చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈపురుపాలెం స్ట్రైయిట్ కట్ కాలువ విషయమై అధికారులు నివేదిక ఇచ్చారని తాను ఇంకా చదవలేదని చెప్పిన కలెక్టర్, గతంలో ఉన్నట్లుగా కాలువను పునరుద్ధరించడం కుదరదని ఇప్పుడు చెబుతున్నారని మత్స్యకారులు మీడియా ఎదుట ఆవేదన వెలిబుచ్చారు. బుర్ల వెంకట్రావు పేరుతో ఉన్న డికె పట్టా దొంగదని, దాని విషయమై న్యాయ విచారణ జరిపి రద్దు చేయాలని, అక్రమంగా కాలువను పూడ్చి వేయడం, రాళ్ళ పెట్టిన విషయమై సదరు వెంకట్రావుపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. వాడరేవు తీరప్రాంత 11 మత్స్యకార గ్రామాల వారికి న్యాయం చెయ్యాలని కోరారు. తమకు న్యాయం జరగకపోతే మరో సారి ఉద్యమిస్తామని మత్స్యకారులు హెచ్చరించారు.

పోలీసు అమరవీరుల కుటుంబాలకు అండగా ఉంటాం..

(మొదటిపేజీ తరువాయి)

నివాళులర్పించారు. కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ దేశభద్రతలో, శాంతిభద్రతల పరిరక్షణలో నిస్వార్థంగా సేవలు అందిస్తున్న పోలీస్ సిబ్బంది మన అందరికీ గర్వకారణమని పేర్కొన్నారు. ఎస్పీ హర్షవర్ధన్‌రాజు మాట్లాడుతూ మన సమాజ రక్షణ కోసం శాంతి భద్రత పరిరక్షణలో మన పోలీసు సోదరులు విధినిర్వహణ చేస్తూ ఉగ్రవాదం, తీవ్రవాదం, మతతత్వం, ఫ్యాక్షనిజం వంటి విచ్ఛిన్నకర శక్తులతో నేరాలకు ఘోరాలకు పాల్పడే అసాంఘిక శక్తులతో పోరాడుతూ సమసమాజ నిర్మాణానికి కంకణబద్ధులై అమరులౌతున్నారన్నారు. విధినిర్వహణలో భాగంగా పోలీసు శాఖలో పనిచేసే మనందరికి ఉత్తేజాన్ని ఇవ్వాలని, వారు భౌతికంగా మతి చెందినా, మన హదయల్లో చిరస్మరణీయులుగా వున్నారని తెలియజేస్తూ ఈ రోజు "నేషనల్ పోలీస్ డే" గా జరుపుకుంటూ వారి బలి దానానికి "సెల్యూట్" చేద్దామన్నారు. ఈ సందర్భంగా ప్రకాశం జిల్లాకు చెందిన పోలీసు అమరవీరులు కుటుంబ సభ్యులతో మంత్రి మాట్లాడి వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ నాగేశ్వరరావు, సంతనూతలపాడు యంయల్‌ఏ బి.ఎన్.విజయకుమార్, కనిగిరి యంయల్‌ఏ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, పీ.డీ.సీ.సీ. బ్యాంకు చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, మాల కార్పొరేషన్ చైర్మన్ పి.విజయ్ కుమార్, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి ఎన్.లక్ష్మానాయక్, ఉప రవాణా శాఖ కమిషనర్ ఆర్.సుశీల, ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, దర్శి డిఎస్పీ లక్ష్మీనారాయణ, కనిగిరి డిఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్, ఏఆర్ డిఎస్పీ శ్రీనివాసరావు, పోలీస్ క్లినిక్ డాక్టర్ భానుమతి పాల్గొన్నారు.

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో, అద్దంకి

A.S.No:8/2024
IN
O.S.No:291/2001

ఆలూరి బిక్షాలు మరియు కొందరు ..... వాదులు

మరియు

పునుగోటి ఆంజనేయులు మరియు కొందరు ... ప్రతివాదులు

To

బత్తుల హనుమంతరావు తండ్రి రాజయ్య
R/o మార్టూరు గ్రామం, మార్టూరు మండలం బాపట్ల జిల్లా

పై నంబరు దావా తాలుకా మీకు ఎన్ని సార్లు సమన్లు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారని శ్రీయుతకోర్టు వారి ఉత్తర్వుల మేరకు మీరు తేది :07-11-2025న ఉదయం 10.30 ని:ల నుండి సాయంత్రం 5.00 గంటల లోపు పైకోర్టు వారి ఎదుట హాజరై తమ ఆక్షేపణలు తెలుపు కొనవలెను. లేనిచో దావాని మీకు పరోక్షముగా తీర్మానించబడును.

// శ్రీయుత కోర్టు వారి ఉత్తర్వులతో //

మోతుకూరి సుభాష్ బాబు
మద్దినేని గృహలక్ష్మి
అడ్వకేట్స్, అద్దంకి

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో, అద్దంకి

O.S. No:188/2025

జాగర్లమూడి రామకృష్ణారావు ..... వాది

మరియు

తాటి పెద్దబ్బాయి మరియు కొందరు ...ప్రతివాదులు

To

తాటి సుప్రజ D/o తాటి పెద్దబ్బాయి
R/o తిమ్మసముద్రం గ్రామం, నాగులుప్పలపాడు మండలం, ప్రకాశం జిల్లా.

పైనంబరు దావా తాలుకా మీకు ఎన్నిసార్లు సమన్లు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారని శ్రీయుత కోర్టువారి ఉత్తర్వుల మేరకు మీరు తేది:15-12-2025న ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల లోపు పైకోర్టు వారి ఎదుట హాజరై తమ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో దావాని మీకు పరోక్షంగా తీర్మానించబడును.

// శ్రీయుత కోర్టు వారి ఉత్తర్వులతో //

మోతుకూరి సుభాష్ బాబు
మద్దినేని గృహలక్ష్మి
అడ్వకేట్స్, అద్దంకి

మహారాజశ్రీ 1వ ఆదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో ఒంగోలు

OS No : 28/2015

పర్రె కళ్యాణి అండ్ అదర్స్ ....వాది

వర్సెస్

తన్నీరు నరసింహారావు అండ్ ఆదర్స్ ...ప్రతివాది

To

D5) గార్లపాటి రజనీకుమారి
D/o (లేటు) నాగేశ్వరరావు
R/o సుందరనగర్,ఒంగోలు

D6) గార్ల పాటి చంద్రశేఖర్
S/o (లేటు) నాగేశ్వరావు
R/o సుందరనగర్, ఒంగోలు

పైనెంబర్ OS No : 28/2015 దావాలో ప్రతివాదులైన D5,D6, వార్ల కునోటీసులు జారీ కానందున శ్రీకోర్టు వారు మీనోటీసులు నిమిత్తమై పేపర్ ద్వారా ప్రకటనకు ఉత్తర్వులు జారీ చేసి ఉన్నారు తేది:29-10-2025న వాయిదా అయి యున్నది కావున పైతెలిపిన కోర్టు నందు ఉదయం గం 10.30 నిమిషాలకుమీరు స్వయంగా గాని లేదా వకీలు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెయను లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియ జేయడమైనది

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

ఇట్లు
కోలా శివప్రసాద్
అడ్వకేట్, ఒంగోలు

దావా సమన్లు

మహారాజశ్రీ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో కనిగిరి, ప్రకాశం జిల్లా,

ఐ.ఏ.నెం.1398/2023
ఓ.యస్ నెం. 206/2023

బిట్వీన్:

షేక్ పొతకమూరి మహమ్మద్ రహిమాన్ వగైరాలు.
.....వాదులు/ పిటీషనర్స్

పెరియమాయ దేవర్ రాజు వగైరాలు
.....రెస్పాండెంట్స్ ప్రతివాదులు

టు

10వ ప్రతివాది

పూసలపురం తమిళ వాణి, తండ్రి (లేటు) రాజు,
భర్త మురుగానందం, బ్లాక్ నెం. 19, దొరువు దగ్గర,
కనిగిరి టౌను, కనిగిరి మండలం,
ప్రకాశం జిల్లా - 523230

పైన తెలిపిన దావాను, వాదులు/ పిటీషనర్స్ మిమ్ములను మరికొందరిని పై దావాలో ప్రతి వాదులుగా చేర్చుటకు పిటీషన్ దాఖలు చేసి యున్నారు. సదరు పిటీషన్ శ్రీకోర్టు వారు మీకు అనేక పర్యాయములు దావా నోటీసులు పంపి యున్నను మీరు పైదావా సంగతి తెలిసియుండి కూడా ఉద్దేశ్య పూర్వకంగా పైదావా సమన్లు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున పైశ్రీకోర్టు వారు ఈ పత్రిక ప్రకటన ద్వారా మీకు నోటీసులు జారిచేయ వలసినదిగా ఆర్డర్ వేసి యున్నారు. మీరు సదరు వ్యాజ్యంలో పైకోర్టు వారి ఎదుట తే.24-10-2025దిన వాయిదా హాజరు నిమిత్తం ఉన్నది. ఆరోజు మీరు ఉదయం 10:30 ని.లకు స్వయముగా గాని, మీ తరపున న్యాయవాది ద్వారా గాని పై కోర్టు వారి యందు హాజరు అయి మీకు గల ఆక్షేపనలు తెలుపుకోగలరు. మీరు హాజరు కానియెడల శ్రీ కోర్టు వారు మీ పరోక్షమున విచారించి పై పిటిషన్ను తీర్మానించెదరు అని మీకు ఇందు మూలముగా తెలియజేయడమైనది.

(ఈ ప్రకటన శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము)

వాయిదా తేదీ : 24-10-2025:

శ్రీ షేక్ రబ్బాని
పిటిషనర్ తరపు అడ్వకేట్,
కనిగిరి, ప్రకాశం జిల్లా
సెల్: 7386098550.

దావా సమన్లు

మహారాజశ్రీ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో కనిగిరి, ప్రకాశం జిల్లా

ఐ.ఏ నెం: 1399/2023
ఐ.ఏ నెం: 567/2023
ఓ.యస్ నెం. 206/2023

బిట్వీన్ :

షేక్ పొతకమూరి మహమ్మద్ రహిమాన్ వగైరాలు
....వాదులు/ పిటీషనర్స్

పెరియమాయ దేవర్ రాజు వగైరాలు
....రెస్పాండెంట్స్/ప్రతివాదులు

టు

10వ ప్రతివాది

పూసలపురం తమిళ వాణి, తండ్రి (లేటు) రాజు,
భర్త మురుగానందం, బ్లాక్ నెం. 19, దొరువు దగ్గర,
కనిగిరి టౌను, కనిగిరి మండలం,
ప్రకాశం జిల్లా - 523230

పైన తెలిపిన దావాను వాదులు/ పిటీషనర్స్ మిమ్ములను మరికొందరిని పైదావాలో ప్రతివాదులుగా చేర్చుటకు పిటీషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటీషన్ శ్రీ కోర్టు వారు మీకు అనేక పర్యాయములు దావా నోటీసులు పంపియున్నను మీరు పైదావా సంగతి తెలిసియుండి కూడా ఉద్దేశ్యపూర్వకంగా పై దావా సమన్లు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున పై శ్రీ కోర్టు వారు ఈ పత్రిక ప్రకటన ద్వారా మీకు నోటీసులు జారిచేయవలసినదిగా ఆర్డర్ వేసి యున్నారు. మీరు సదరు వ్యాజ్యంలో పైకోర్టు వారి ఎదుట తే.24-10-2025దిన వాయిదా హాజరు నిమిత్తం ఉన్నది. ఆరోజు మీరు ఉదయం 10:30 ని.లకు స్వయముగా గాని, మీ తరపున న్యాయవాది ద్వారా గాని పైకోర్టు వారి యందు హాజరు అయి మీకు గల అక్షేపనలు తెలుపుకోగలరు. మీరు హాజరు కానియెడల శ్రీకోర్టు వారు మీ పరోక్షమున విచారించి పై పిటిషన్ను తీర్మానించెదరు అని మీకు ఇందు మూలముగా తెలియజేయడమైనది.

(ఈ ప్రకటన శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము)

వాయిదా తేదీ : 24-10-2025:

శ్రీ షేక్ రబ్బాని
పిటిషనర్ తరపు అడ్వకేట్,
కనిగిరి, ప్రకాశం జిల్లా
సెల్: 7386098550.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో ఒంగోలు

EP No : 74/2025 ఇన్
EP No : 44/2018 ఇన్
OS No : 333/2014

కంభంపాటి ఆంజనేయులు ...పిటిషనర్/DHR

వర్సెస్

తిరుమలశెట్టి సుశీల మరియు ఇతరులు
....రెస్పాండెంట్స్/JDRs

To

R1) తిరుమలశెట్టి సుశీల,
భర్త (లేటు) రవిబాబు హిందూ

R2) తిరుమలశెట్టి మాధురి
తండ్రి (లేటు)రవిబాబు హిందూ

R3) తిరుమలశెట్టి సాత్విక్
తండ్రి (లేటు) రవిబాబు హిందూ

పై వారి అందరిని నివాసం,
1st లైన్ శ్రీనగర్ కాలనీ,కర్నూల్ రోడ్డు,
ఒంగోలు. ప్రకాశం జిల్లా

పైనెంబర్ గల పిటిషన్‌లో పిటిషనర్ మీకు ఎన్నిసార్లు కోర్టు ద్వారా నోటీసులు పంపినప్పటికీ మీరు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నారు కావున పైకోర్టువారు పత్రికా ప్రకటన ద్వారా తెలియ జేయవలసిందిగా ఆదేశించివున్నారు కావున మీరు తేది 28-10-2025న ఉదయం గం 10.30 నిమిషాలకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని లేదా వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెయను లేనియెడల మీ పరోక్షమున తీర్మానించ బడునని తెలియజేయడమైనది

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

ఇట్లు
కోలా శివప్రసాద్
అడ్వకేట్, ఒంగోలు

భారీ వర్షం.. రోడ్లు జలమయం

ప్రజాశక్తి-శింగరాయకొండ

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో శింగరాయకొండ మండలంలో మంగళవారం భారీ వర్షాలు కురిశాయి. మంగళవారం తెల్లవారుజాము నుంచి మొదలైన వర్షం రాత్రి వరకు ఆగుతూ కురుస్తూనే ఉంది. దీంతో రోడ్లపై వర్షపు నీరు ప్రవహించింది. పాకల, ఊళ్లపాలెం గ్రామాలలో మత్స్యకారులను అప్రమత్తం చేసి లోతట్టు ప్రాంతాల వారిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. తహశీల్దార్ రాజేష్, ఎంపీడీవో డి.జయమణి సందర్శించి మత్స్యకారులను సముద్రం వేటకు వెళ్లరాదని, తుఫాను ప్రభావం అధికంగా ఉంటుందని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సముద్రం దగ్గర అలలు ఉధృతి మంగళవారం సాయంత్రం నుంచి ఎక్కువగా ఉంది. సర్పంచ్ సైకం చంద్రశేఖర్, డిప్యూటీ ఎంపీడీవో రమేష్‌బాబు, ఆర్ఐ ప్రసాదు, కార్యదర్శి సుభాని తదితరులు ఉన్నారు. సముద్ర తీరం వద్ద రామాయపట్నం మెరైన్ పోలీసులు ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. తుఫాను సందర్భంగా మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని అధికారులు సూచించారు.

పొలాల్లోకి నీరు.. ఆందోళనలో అన్నదాతలు

కొనకనమిట్ల: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడన ప్రభావంతో కొనకనమిట్ల మండలంలో మంగళవారం కురిసిన భారీ వర్షానికి పంట పొలాల్లోకి నీరు చేరింది. దీంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పొగాకు, మిర్చి పంటల్లోకి నీరు చేరి బయటకు వెళ్లే మార్గం లేక ఎక్కడ నీరు అక్కడే నిల్వ ఉంది. దీంతో ఆ పంటలు దెబ్బతినే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గనివెనపాడులో పొగాకు పంటలోకి నీరు చేరడంతో ఆ రైతు లబోదిబో అంటున్నారు. రాత్రికి కూడా వర్షం కురిస్తే పొగాకు, మిర్చి, పత్తి పంటలు దెబ్బతినే అవకాశాలు ఉన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



తీరం వద్ద అప్రమత్తమైన మెరైన్ పోలీసులు

కొత్తపట్నం: తుఫాను హెచ్చరికల నేపథ్యంలో కొత్తపట్నం బీచ్‌లో అధికారులు సముద్ర తీరాన్ని, తుఫాను షెల్టర్ను పరిశీలించారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో సన్నద్ధత పనులను జిల్లా పంచాయతీ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, జెడ్పీ సీఈఓ బి.చిరంజీవి, డిఆర్డిఏ పిడి టి.నారాయణ, డిఎంఅండ్ హెచ్ఓ టి.వెంకటేశ్వర్లు మంగళవారం పరిశీలించారు. కొత్తపట్నం మండలంలోని ఈతముక్కలలో ఏర్పాటు చేసిన రిలీఫ్ సెంటర్లలో ఎర్పాట్లును పరిశీలించారు. అధికారులు స్థానిక ప్రజలకు తుఫాను సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై అవగాహన కల్పించారు. ప్రమాద ప్రాంతాల్లో తక్షణ చర్యలు తీసుకుని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఫీల్డ్ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీకృష్ణ, డిప్యూటీ ఎంపీడీవో మూర్తి, ఏపిఎం విజయ కుమారి, కార్యదర్శి సంపత్ మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.



శింగరాయకొండలో రోడ్డు ప్రవహిస్తున్న నీరు



మత్స్యకారులతో మాట్లాడుతున్న అధికారులు

పోలీసుల త్యాగాలు మరువలేనివి

ఘనంగా అమర వీరుల సంస్మరణ దినోత్సవం

ప్రజాశక్తి-దర్శి

పోలీసులు త్యాగాలు మరువలేనివని డీఎస్పీ బి.లక్ష్మీ నారాయణ, సీఐ వై.రామారావు అన్నారు. మంగళవారం పోలీసుల అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి ర్యాలీగా డీఎస్పీ కార్యాలయం, కురిచేడు రోడ్డులోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి అద్దంకి రోడ్డులోని సీఐ కార్యాలయం, గడియార స్తంభం సెంటర్ వరకు ర్యాలీ జరిగింది. విద్యార్థులతో కలిసి మానవ హారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.శ్రావణ్‌కుమార్, ఎస్ఐ ఎం.మురళి మాట్లాడారు.

శామంతపూడి ప్రాథమిక పాఠశాలలో మంగళవారం పోలీసు అమరవీరుల దినోత్సవం కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఎస్ఐ మురళి, హెచ్ఎం పి.రవి, షరీఫ్, మోహన్, సుబ్బు, కృష్ణ, ముక్కాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొండపి : పోలీసుల సంస్మరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కొండపి పోలీస్ స్టేషన్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు పోలీసులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ సోమశేఖర్ మాట్లాడుతూ 1959 అక్టోబర్ 21 లడక్‌లోని హాక్ చాయ్ ఘటనలో అమరులైన రోజు పోలీసుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమం జరుపుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు ప్రేమ్ కుమార్, రమేష్‌బాబు, అనూక్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



దర్శిలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు



కనిగిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

పామూరు: అమరవీరుల త్యాగం ఎంతో గొప్పదని వారి ఆశయాల కోసం పనిచేయాలని పామూరు సిఐ భీమ నాయక్ అన్నారు. మంగళవారం పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భముగా పామూరు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు కిషోర్ బాబు, ఎం.వెంకటేశ్వర నాయక్, కృష్ణ పావని, సిబ్బంది పాల్గొన్నారు.

కనిగిరి: పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా కనిగిరిలో మంగళవారం పోలీసు సిబ్బంది, వైష్ణవి మహిళా కళాశాల విద్యార్థినిలు ర్యాలీ నిర్వహించారు. పామూరు బస్టాండ్ సెంటర్లో మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా సిఐ షేక్ ఖాజావలి పోలీస్ అమరవీరుల చిత్రపటాలకి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం తమ ప్రాణాలను పణంగా పెట్టి అమరులైన పోలీసుల త్యాగాలు మరువలేనివి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కనిగిరి ఎస్సై టి శ్రీరామ్, హెచ్ఎం పాడు ఎస్సై మాధవరావు, పీసీపల్లి ఎస్సై కోటయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న సిఐ భీమా నాయక్

డిఎ జీవోను తక్షణమే సవరించాలి

ప్రజాశక్తి-సీఎస్‌పురం రూరల్

ఉద్యోగులకు ఒక డీఏను మంజూరు చేస్తూ ప్రభుత్వం విడుదల చేసిన జీవోను తక్షణమే సవరించాలని యుటిఎఫ్ మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నారిశెట్టి వెంకట్రామయ్య, షేక్ పాదుషా, జిల్లా కార్యదర్శి వి.సాంబశివరావులు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. యుటిఎఫ్, ఉపాధ్యాయ సంఘాల పోరాటాల ఫలితంగా ఉద్యోగులకు ఒక డీఏను మంజూరు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించినట్లు చెప్పారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ డీఏ జీవో ద్వారా వచ్చే అరియర్స్ ఉద్యోగ విరమణ చేసిన తర్వాత చెల్లిస్తామని జీవోలో పేర్కొనడం పట్ల వారు తీవ్ర వ్యతిరేకతను వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. సిపిఎస్ ఉద్యోగులకు సంబంధించి ఈ జీఓలలో ఎక్కడా ప్రస్తావించకపోవడం సరికాదన్నారు. నాలుగు డీఏలు ఇవ్వాల్సిన ప్రభుత్వం ఒక డిఏకు మాత్రమే జీవోను విడుదల చేసి ఆ డిఏ చెల్లింపునకు కూడా ఇంత గందరగోళానికి గురి చేయడాన్ని ఉద్యోగ, ఉపాధ్యాయులను మోసం చేయడమే అన్నారు.

వాలీబాల్ పోటీలలో విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి-టంగుటూరు

స్కూల్ గేమ్స్ అండర్-17 డివిజనల్ వాలీబాల్ పోటీలు ఒంగోలు డిఆర్ఆర్ఎం హైస్కూల్లో మంగళవారం జరిగాయి. ఈ వాలీబాల్ పోటీలలో టంగుటూరు హైస్కూల్‌కు చెందిన విద్యార్థినులు టి.రిషితప్రియ, సిహెచ్ లిఖిత, బి.సిరిపండులు విజయం సాధించారు. వాలీబాల్‌లో విజేతలను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తులసి ప్రభ, వ్యాయామ ఉపాధ్యాయులు నామా అరుణ, ఉపాధ్యాయులు అభినందించారు.



విజేతలను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బస్సు, కారు ఢీ.. నలుగురికి గాయాలు

ప్రజాశక్తి-పెద్దదోర్నాల



బస్సును ఢీకొన్న కారు

బస్సు, కారు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో నలుగురు గాయపడిన సంఘటన శ్రీశైలం ఘాట్‌రోడ్డులో చోటుచేసుకుంది. శ్రీశైలం నుంచి దోర్నాల వెళ్తున్న విజయవాడకు చెందిన ఆర్టీసీ బస్సు, బెంగళూరు నుంచి శ్రీశైలం దర్శనానికి వస్తున్న కారు ఎదురెదురుగా మలుపు వద్ద ఢీకొన్నాయి గాయపడిన ప్రభావతి, రవికుమార్, భాస్కర్, తేజశ్రీలను 108 సిబ్బంది సుండిపెంట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. ఘాట్ రోడ్డులో ప్రమాదకరమైన మలుపులు ఉన్నాయని తెలిసి కూడా అధిక వేగంతో రావడంతోనే ఇటువంటి ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు చర్చించుకుంటున్నారు.

జూదరులు అరెస్టు

ప్రజాశక్తి-కొండపి

మండలంలోని పెరిదేపి గ్రామ శివారుల పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ బి.ప్రేమ్ కుమార్ తెలిపారు. వీరి నుంచి రూ.12,300 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి నిందితులను సింగరాయకొండ కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్లు శ్రీకాంత్, హోంగార్డు రాజశేఖర్ పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ తనిఖీ

ప్రజాశక్తి-మద్దిపాడు/నాగులుప్పలపాడు



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ

నాగులుప్పలపాడు, మద్దిపాడు పోలీస్ స్టేషన్లను మంగళవారం జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు ఆకస్మికంగా సందర్శించారు. పోలీస్ స్టేషన్ ఆవరణాన్ని, గదులను, మహిళా సహాయక కేంద్రం, రిసెప్షన్ కౌంటర్, స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. స్టేషన్ నిర్వహణ రికార్డులు, సిడి ఫైల్స్‌ను, పలు రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పరిధిలో లా అండ్ ఆర్డర్, నేర నివారణ వ్యూహాలపై తీసుకుంటున్న చర్యలపై అధికారులను ఆరా తీసి పలు సూచనలు చేసారు. ఈయన వెంట డిఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఎస్బి ఇన్స్పెక్టర్ రాఘవేంద్ర, ఒంగోలు రూరల్ సీఐ యన్.శ్రీకాంత్ బాబు, యన్.జి పాడు ఎస్సై రజియా సుల్తాన్, మద్దిపాడు ఎస్సై వెంకట సూర్య ఉన్నారు.

ఏఎంఆర్, గ్రానైట్ ఫ్యాక్టరీ యజమానుల చర్చలు విఫలం

ప్రజాశక్తి-చీమకుర్తి



సమావేశంలో నాయకులు, సంస్థ ప్రతినిధులు

ఉమ్మడి ప్రకాశం జిల్లా గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానుల అసోసియేషన్ నాయకులకు, ఏఎంఆర్ ప్రతినిధులకు మధ్య జరిగిన చర్చలు నాలుగో దఫా కూడా విఫలమయ్యాయి. మంగళవారం ఒంగోలులోని ఏఎంఆర్ కార్యాలయంలో నాలుగు గంటల పాటు సుదీర్ఘంగా జరిగిన చర్చలలో ఎలాంటి పురోగతి కానరాలేదు. ఏఎంఆర్ కార్పొరేట్ సంస్థ ప్రతినిధులు తాము మొదటి నుంచి చెబుతున్న మాట మీదే నిలబడ్డారు. దీంతో చర్చలు వాయిదా పడ్డాయి. భవిష్యత్తు కార్యాచరణపై ఫ్యాక్టరీ యజమానుల సంఘాల నాయకులు తల మునకలయ్యారు. చర్చలలో చీమకుర్తి ప్రాంత ఫ్యాక్టరీ యజమానుల సంఘాల నాయకులు మార్వెల్ బుజ్జి, కాట్రగడ్డ రమణయ్య, ఎర్రగుంట్ల శ్రీనివాసరావు, లగడపాటి శ్రీనివాసరావు, సిహెచ్ మస్తాన్ రెడ్డి, మలినేని వెంకటేశ్వర్లు, కోడూరి వెంకట్రావు, మార్టూరు ఏరియా ఫ్యాక్టరీ యజమానుల సంఘాల నాయకులు పి.సురేషు, దివ్య ప్రసాదు, మస్తానయ్య, మద్దిపాడు గ్రోత్ సెంటర్ ఫ్యాక్టరీ యజమానుల సంఘాల నాయకులు ఆళ్ల రవి, మండవ రత్నాకర్ రావు, పీజీ రాజు, గ్రానైట్ ఫ్యాక్టరీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎర్రమనేని కోటేశ్వరరావు, ఏఎమ్ఆర్ ప్రతినిధులు పాల్గొన్నారు.



ప్రసన్నాంజనేయ స్వామిని దర్శించుకున్న మంత్రి స్వామి

సింగరకొండలో మంత్రి స్వామి పూజలు

ప్రజాశక్తి - అద్దంకి

సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల బాల వీరాంజనేయ స్వామి కుటుంబ సభ్యులతో కలిసి సింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దర్శించుకున్నారు. మంత్రి స్వామికి ఆలయ మర్యాదలతో దేవస్థాన చైర్మన్ చుండూరి మురళి సుధాకరరావు స్వాగతం పలికారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద పూజ చేశారు. వేద పండితులు ఆశీర్వచనాలు, ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ శింగరకొండ దేవస్థానంకు అనేకసార్లు వచ్చినట్లు తెలిపారు. ఆలయ పునరుద్ధరణ తర్వాత కుటుంబంతో పాల్గొన్నట్లు తెలిపారు. స్థానిక మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో కలిసి దేవస్థానం అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని అన్నారు. కార్యక్రమంలో దేవస్థానం పాలక మండలి సభ్యులు, వేద పండితులు, ప్రధాన అర్చకులు కోటా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



క్రాకర్స్ కాలుస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

దీపావళి సంబరాల్లో శాసన సభ్యులు కొండయ్య

ప్రజాశక్తి - చీరాల

దీపావళి పండుగ సంబరాల్లో శాసన సభ్యులు మద్దులరి మాలకొండయ్య కుటుంబ సభ్యులతో కలిసి దీపావళి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. హైదరాబాదులోని తన నివాసంలో సినీ హీరో, మేనల్లుడు నిఖిల్, తనయులు, నియోజకవర్గ అధికార ప్రతినిధి మద్దలూరు మహేందర్ నాథ్, అమర్నాధ్‌తోపాటు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. టపాసులు కాలుస్తూ, దీపాలు వెలిగిస్తూ ఉత్సాహంగా పండుగ జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండయ్య మాట్లాడుతూ దీపావళి పండుగ ప్రతి ఇంట ఆనందం, వెలుగులు నింపాలని, నియోజకవర్గ ప్రజలందరూ సుఖ శాంతులు, అభివృద్ధితో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.



క్రీడా వస్తువులు పంపిణీ చేస్తున్న రోటరీ సభ్యులు

క్రీడా వస్తువుల పంపిణీ

ప్రజాశక్తి - పర్చూరు

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని కొమరనేని వారిపాలెం ఎంపీ యుపి పాఠశాల విద్యార్థులకు క్రీడా పరికరాలు మంగళవారం పంపిణీ చేశారు. నాగుబైరు జాహ్నవి 2వ పుట్టినరోజు సందర్భంగా తన తాత నాగబైరు శ్రీనివాసరావు రూ.12వేల విలువైన క్రీడా వస్తువులు రోటరీ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్ ఆధ్వర్యంలో ఎంఈఓ పి వెంకటరామయ్య చేతుల మీదుగా బహూకరించారు. విద్యార్థులు చదువులతోపాటు ఆటల్లోనూ ముందుండాలని చెప్పారు. ఆటలు మానసిక, శారీరక దృఢత్వం పెంచుతుందని అన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి కోమటి ఆంజనేయులు, కోశాధికారి పంబి సదానందరెడ్డి, సర్పంచ్ మున్నంగి వెంకటసుబ్బయ్య, పాబోలు ఉదయభాస్కర్, నాగబడి సుబ్బారావు, ఆర్ఎంపి సిహెచ్ వెంకటేశ్వర్లు, హెచ్ఎం జి భారతిదేవి పాల్గొన్నారు.

అమెరికా సుంకాలకు నిరసనగా..

ట్రంప్ దిష్టిబొమ్మ దహనం



పర్చూరులో ట్రంబ్ బొమ్మ దగ్ధం చేస్తున్న దృశ్యం



కొల్లూరులో మాట్లాడుతున్న టి కృష్ణమోహన్



కొరిశపాడులో మాట్లాడుతున్న మోంద్రు ఆంజనేయులు

ప్రజాశక్తి - బాపట్ల

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధి విధిస్తున్న ఎగుమతి, దిగుమతి సుంకాలు వెంటనే విరమించుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి టి కృష్ణమోహన్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి కొండయ్య డిమాండ్ చేశారు. ట్రంప్ విధానాలకు వ్యతిరేకంగా స్థానిక పాత బస్టాండ్ సెంటర్లో ట్రంప్ దిష్టిబొమ్మ మంగళవారం దహనం చేశారు. అనేక దేశాలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పన్నుల ఆంక్ష విధిస్తున్నాడని అన్నారు. కొన్ని దేశాలు అమెరికాపై తిరిగి సుంకాలు విధిస్తున్నాయని అన్నారు. అమెరికాలో భారత దేశ ప్రజలు లక్షల సంఖ్యలో ఉన్నారని వారిపై అనేక రకాల వీసా ఆంక్షలు విధిస్తూ అక్కడున్న భారతీయులను ఆందోళనకు గురి చేస్తున్నారని అన్నారు. భారత్ రష్యా వద్ద ముడి చమురు కొనుగోలు చేస్తోందన్న ఆరోపణతో భారత్ నుండి అమెరికాకు దిగుమతి అయ్యే కొన్ని సరుకులపై 25 నుండి 100 శాతం దిగుమతి సుంకాలు విధిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో ఆక్వా రొయ్యల పరిశ్రమపై ఈ భారం పడుతుందని అన్నారు. దీంతో పరిశ్రమలు మూతబడి కొన్ని లక్షల సంఖ్యలో కార్మికులు వీధిన పడే పరిస్థితి ఎదురు కానుందని అన్నారు. అమెరికా నుండి భారత్‌కు దిగుమతయ్యే పంటలపై సుంకాలు తగ్గించి దిగుమతికి భారత ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తోందని అన్నారు. రాష్ట్రంలో ఆహార ఉత్పత్తులు కోళ్ల, పాడి పరిశ్రమ, పత్తి, మొక్కజొన్న పంటలపై దీని ప్రభావం చూపుతోందని అన్నారు. వ్యవసాయ రంగంలో సైతం సుంకాల వల్ల నష్టం రావడంతో కూలీలు పనుల్లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి కె శరత్, ఐద్వా జిల్లా కార్యదర్శి టి సుభాషిణి, కె నాగేశ్వరావు, లక్ష్మణ్, రవికిరణ్, వలి, అనూష పాల్గొన్నారు.

పంగులూరు : అమెరికా అధ్యక్షుడు ట్రంపు దిష్టిబొమ్మ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం దగ్ధం చేశారు. ట్రంప్ విధానాలు వ్యతిరేకంచండి, భారతదేశాన్ని కాపాడండి అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు మాట్లాడారు. భారతదేశ ఆర్థిక పరిస్థితిని, వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసే విధంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యవహరిస్తున్నాడని అన్నారు. గొర్రెల్లాగా తల ఆ డిస్తూ ప్రధాని నరేంద్ర మోడీ ఆ విధానాలు అమలు చేయడానికి సిద్ధమయ్యాడని ఆరోపించారు. భారతదేశ స్వతంత్ర ప్రపత్తిని నాశనం చేసేందుకు ట్రంపు, మోడీ కంకణం కట్టుకున్నారని అన్నారు. విదేశీ ఉత్పత్తులు దిగుమతి చేసుకునేందుకు సుంకం లేకుండా చేసి, మన దేశం నుండి ఎగుమతి చేసే వస్తువులకు మాత్రం విపరీతమైన సుంఖాలు వేస్తున్నారని అన్నారు. దీనివల్ల ఇక్కడ వ్యవసాయం దెబ్బతింటుందని అన్నారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు రాయిని వినోద్ బాబు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పూసపాటి సుబ్బరాజు, ప్రజానాట్యమండలి నాయకులు సరికొండ రామచంద్రరాజు, తలపనేని సుబ్బారావు, పోతుగంటి ఆధుం సాహెబ్, తానికొండ సుధాకర్, సాంబయ్య, శ్రీనివాసరావు, హనుమంతరావు, ఎన్ అంజయ్య, చిలుకూరి సాంబశివరావు పాల్గొన్నారు.

కొల్లూరు : భారతీయ వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసే కుట్రతో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సుంకాలు విధించడాన్ని వ్యతిరేకిస్తూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ట్రంప్ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి టి కృష్ణమోహన్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వేములపల్లి వెంకట రామయ్య మాట్లాడారు. ట్రంప్ సుంకాల వల్ల భారతదేశంపై తీవ్ర ప్రభావం పడుతుందని అన్నారు. ట్రంప్ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పి నాగమల్లేశ్వరరావు, బోనిగల సుబ్బారావు, రమేష్ పాల్గొన్నారు.

కారంచేడు : ఎపి కౌలు రైతు సంఘం, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మండలంలోని స్వర్ణ గ్రామంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి కొండయ్య మాట్లాడారు. భారతదేశంపై దారుణంగా అమెరికా వేస్తున్న సుంకాలపై ప్రధాని మోడీ నోరు మెదపలేదని, సుంకాల భారాన్ని తగ్గించాలని మాట్లాడకపోవడం విచారకరమని అన్నారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఏడుకొండలు, ఒంటరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పర్చూరు : దేశంలో వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం పడుతుందని, సుంకాలు ఎత్తివేయడానికి భారత ప్రభుత్వం అమెరికాపై తీవ్ర ఒత్తిడి తీసుకురావాలని రైతు సంఘం, కౌలు రైతు సంఘం డిమాండ్ చేస్తూ దీపావళి సందర్భంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ట్రంప్ దిష్టిబొమ్మను స్థానిక బొమ్మల సెంటర్లో దగ్ధం చేశారు. జీడిపప్పు, ఆక్వా, చేపలు, పౌల్ట్రీ తదితర రంగాలపై తీవ్ర ప్రభావం పడుతుందని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి కొండయ్య అన్నారు. మన దేశంపై 60 శాతం పన్ను వేసి మన పక్కనే ఉన్న శ్రీలంక, బంగ్లాదేశ్, పాకిస్తాన్లపై 20శాతం పన్ను వేసిందని, ఒకపక్క మోడీ అమెరికా తన మిత్ర దేశమని, ట్రంపు తనకు మిత్రుడని చెప్పుకుంటూ అమెరికా చర్యలు వ్యతిరేకించకపోవడం దారుణమని అన్నారు. ట్రంప్ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. సుంకాలు వివరిస్తూ ప్రచురించిన కరపత్రాలు విస్తృతంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొమ్మినేని శ్రీనివాసరావు, ఎం డేవిడ్, టి పేతురు పాల్గొన్నారు.

మార్టూరు : అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ భారత దేశంపై సుంకాలు విధించడాన్ని నిరసిస్తూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో స్థానిక సెంటర్లో పెద్ద ఖాన దగ్గర ట్రంప్ దిష్టి బొమ్మ సోమవారం దగ్ధం చేశారు. అమెరికా నుండి పాలు, మొక్కజొన్న ఎలాంటి సుఖాలు లేకుండా దిగుమతి చేస్తున్నారని, మనదేశంలో పండించిన పంటలపై ఎగుమతి చేసుకోవడానికి అధిక సుంకాలు విధిస్తూ ఇక్కడి పంటలు పండించే రైతులపై తీవ్ర ప్రభావం పడుచున్నదని అన్నారు. కార్యక్రమంలో రైతు సంఘ మండల అధ్యక్ష, కార్యదర్శులు పేర్ని నాగేశ్వరరావు, వీరవల్లి కృష్ణమూర్తి, జిల్లా ఉపాధ్యక్షుడు కె రామకోటేశ్వరరావు, వై రాంబాబు, ఎం సాంబశివరావు, ఎస్ అంకమ్మ చౌదరి, బి సూరిబాబు, శేషాద్రి, కోటేశ్వరరావు, సిఐటియు నాయకులు బి హనుమంతరావు, టి బాబురావు పాల్గొన్నారు.

ఇంకొల్లు : భారతదేశంలో అమెరికా అధ్యక్షుడు విధిస్తున్న సుంకాలకు వ్యతిరేకంగా స్థానిక స్థూపం సెంటర్లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ట్రంప్ చిత్రపటాన్ని మంగళవారం దహనం చేశారు. కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి కొండయ్య మాట్లాడారు. ట్రంప్ సుంకాల వల్ల దేశంలో పౌల్ట్రీ, జీడిపప్పు పరిశ్రమ, ఆక్వా రంగం తోపాటు పత్తి రైతులను దెబ్బతీసే ప్రయత్నాలు మానుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం కార్యదర్శి నాగండ్ల వెంకట్రావు, నలతోటి భాను ప్రసాద్, కసుకుర్తి గంగయ్య, ఆశీర్వాదం, నెల్సన్ అక్కయ్య, రైతు నాయకులు మాదాల అంజయ్య, బొగ్గవరపు శంకర్రావు, బండి సాంబయ్య, ఎర్రం గోవిందరెడ్డి పాల్గొన్నారు.



పంగులూరులో ట్రంప్ దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న దృశ్యం



కారంచేడులో దిష్టి బొమ్మ దగ్ధం చేస్తున్న దృశ్యం



ఇంకొల్లు స్థూపం సెంటర్లో ప్రజా సంఘాల నిరసన

భారీ వర్షంతో రోడ్లపై నిలిచిన నీరు

ప్రజాశక్తి - పర్చూరు

మండల కేంద్రమైన పర్చూరులో మంగళవారం మధ్యాహ్నం ఒక్కసారిగా ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. పర్చూరు, చీరాల ఆర్ అండ్ బి రోడ్డులోని సినిమా హాల్ సెంటర్ రోడ్ అంతా జలమయమైంది. మోకాలు లోతు పైగా నీరు ప్రవహించింది. ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ప్రయాణించడానికి ఇబ్బందులు పడ్డారు. సుమారు గంటసేపు వర్షం పడింది. ఈ రోడ్డులోని షాపుల వద్ద మెరక తోలడంతో రోడ్డంతా పల్లపు ప్రాంతంగా మారింది. దీంతో వర్షం కురిసినప్పుడల్లా మోకాలు లోతు నీరు ప్రవహిస్తుంది. సైడ్ మార్జిన్‌లో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో రోడ్డుపై నీరు నిలిచిపోతున్నది. సంబంధిత అధికారులు పర్చూరు, చీరాల ఆర్ అండ్ బి రోడ్డులో ఇరువైపులా డ్రైనేజీ కాలువలు నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. అలాగే ఇంకొల్లు రోడ్డులోని మార్కెట్ సెంటర్ రోడ్డులో వర్షపు నీరు నిలిచి ఇబ్బంది కలిగిస్తుంది. డ్రైనేజీ కాలువ నిర్మాణాలు చేపట్టాలని కోరుతున్నారు.



సినిమా హాల్ సెంటర్లో మోకాలు లోతులో నిలిచిన నీరు



సంతకాల సేకరణ చేస్తున్న వైసీపీ నాయకులు

వైసిపి సంతకాల సేకరణ

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మాజీ సిఎం వైఎస్ జగన్మోహనరెడ్డి ఆదేశాల మేరకు వైసిపి ఇన్‌ఛార్జి వరికూటి అశోక్ బాబు ఆధ్వర్యంలో వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సూరేపల్లి పంచాయతీలోని వేమవరంలో కోటి సంతకాల సేకరణ మంగళవారం చేపట్టారు. వైసిపి ఎస్సీ అధ్యక్షులు జంగం వాసు పాల్గొన్నారు.

ఎల్ఐసి ఎఒఐ కమిటీ ఎన్నిక

అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా నరసింహారావు, వెంకట్రావు



నరసింహారావు



బి.వెంకట్రావు

ప్రజాశక్తి-కందుకూరు

ఎల్ఐసి ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసి ఎఒఐ) నెల్లూరు డివిజన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా సిహెచ్. నరసింహారావు, బి.వెంకట్రావు ఎన్నికయ్యారు. ఆదివారం నాడు కందుకూరులో జరిగిన యూనియన్ 6వ నెల్లూరు డివిజన్ మహా సభలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన కమిటీ వివరాలను మంగళవారం విడుదల చేశారు. డివిజన్ అధ్యక్షులుగా సిహెచ్.నరసింహారావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా డి.శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా బి.వెంకట్రావు, కోశాధికారిగా సిహెచ్.చిన్న మాలకొండయ్య, ఉపాధ్యక్షులుగా జి.ధనుం జయ, కె.వెంకటేశ్వర్లు, బి.మధుసూదన రావు, సహాయ కార్యదర్శులుగా ఆర్.హజరత్‌రెడ్డి, యస్.శ్రీనివాసులు, పి.ఆంజనేయులు, కమిటీ సభ్యులుగా యస్ఎ.బషీర్, యన్.వెంకటేశ్వరరెడ్డి, వై.వి. కృష్ణయ్య, యం.నర్సయ్య, కె.వెంకటేశ్వరరెడ్డి, యస్.రమణి, కె.వి.శేషమ్మ ఎన్నికయ్యారు.

కార్తీకమాసం సందర్భంగా ప్రత్యేక బస్సులు

ఆర్టీసీ ఆర్ఎం సత్యనారాయణ

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

కార్తీకమాసం సందర్భంగా శైవభక్తుల కోసం రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ) ప్రత్యేక బస్సు సర్వీసులను ప్రారంభిస్తున్నట్లు రీజనల్ మేనేజర్ జి.సత్యనారాయణ మంగళవారం నాడు తెలిపారు. ప్రకాశం జిల్లాలోని భక్తులు ఒకే రోజులో ఐదు ప్రముఖ శైవక్షేత్రాలైన పంచారామాలను దర్శించుకునే అవకాశం కల్పిస్తూ ఈ బస్సులను నడపనున్నట్లు పేర్కొన్నారు. అమరావతిలోని అమరారామం, భీమవరంలోని సోమేశ్వరారామం, పాలకొల్లులోని క్షీరారామం, ద్రాక్షారామంలోని భీమేశ్వరారామం, సామర్లకోటలోని కుమారారామం వంటి క్షేత్రాలకు భక్తులు సులభంగా చేరుకునే విధంగా ప్రతి ఆదివారం రాత్రి ప్రత్యేక బస్సులు బయలుదేరి, సోమవారం రోజున దర్శనాలు ముగించుకొని, మంగళవారం ఉదయం తిరిగి స్వస్థలాలకు చేరుకునేలా సౌకర్యం కల్పించినట్లు వివరించారు. ఈ సర్వీసులు ఈ నెల 26, నవంబరు 2, 9, 16 తేదీల్లో నడపబడనున్నట్లు తెలిపారు. భక్తులు ఈ బస్సుల టికెట్లను ముందుగానే ఆన్‌లైన్ రిజర్వేషన్, ఆర్టీసీ ప్రధాన బస్టాండ్లు, లేదా అధికారిక ఏజెంట్ల ద్వారా బుక్ చేసుకోవచ్చని సూచించారు. ప్రకాశం జిల్లా పరిధిలోని పలు పట్టణాల నుండి చార్జీలను కూడా సంస్థ ప్రకటించిందన్నారు. మార్కాపురం నుండి రూ.2100, గిద్దలూరు నుండి రూ.2200, పొదిలి నుండి రూ.1900, కనిగిరి నుండి రూ.2000,ఒంగోలు నుండి రూ.1800గా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. జిల్లాలోని ప్రయాణికులకు ఈ సదవకాశం ఉపయోగించుకోవాలని కోరారు.

భారీ వర్షాల నేపథ్యంలో

నగరపాలక సంస్థ ముందస్తు చర్యలు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో ఒంగోలు నగరంలో ప్రమాద తీవ్రతను తగ్గించేందుకు నగరపాలక సంస్థ ముందస్తు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా నగర పాలక సంస్థకు చెందిన ఇంజనీరింగ్ మరియు శానిటేషన్ సిబ్బందితో నగరంలోని ప్రధాన డ్రైనేజి మరియు మురికినీటి కాలువలను యుద్ధ ప్రాతిపదికన పరిశీలించి వాన నీరు ఎటువంటి అవరోధం లేకుండా పోతురాజు కాలువ/ నల్ల కాలువ నందు కలిపేందుకు చర్యలు తీసుకున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు తెలియజేశారు. నగరపాలక సంస్థలో కాల్ సెంటర్ (08592-227766) ను ఏర్పాటు చేశామన్నారు. భారీ వర్షాల సందర్భముగా ఏదైనా అవాంతరాలు తలెత్తిన యెడల నగరపాలక సంస్థ కార్యాలయములోని ఫోన్ నెంబరు: 08592-227766 నకు ఫోన్ కాల్ ద్వారా గాని లేదా ఆయా సచివాలయాల పరిధిలోని వార్డు సెక్రటరీల దష్టికి తమ సమస్యను తెలియజేయాలని కమిషనర్ సూచించారు.

పత్తి కొనుగోలు కేంద్రాలు సిద్ధం చేయాలి

కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా



కలెక్టర్ వినోద్‌కుమార్

జిల్లాలో పత్తి కొనుగోలు కేంద్రాలు సిద్ధం చేయాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ లోని న్యూ వి.సి. హాల్ లో పత్తి కొనుగోలు కేంద్రాలు, సంక్షేమ వసతి గృహాల అభివృద్ధి, ఈక్రాప్ నమోదు, ఈ మత్స్యకార యాప్ నమోదు, ఎరువుల సరఫరా తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ వీక్షణ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పది మండలాల్లో పత్తి పంట సాగు చేశారన్నారు. నవంబర్ రెండవ వారం నుండి పత్తి కొనుగోలు చేయడానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఎరువుల విక్రయాలకు సంబంధించి ఐ.ఎం.ఎఫ్.ఎస్ యాప్ అప్లోడ్ చేయాలని అధికారులకు చెప్పారు. రైతులు పండించిన పంటలకు సంబంధించి ఈక్రాప్ నమోదు వెంటనే చేయాలని ఆయన వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. మత్స్యకార యాప్‌లో ఆక్వా పరిశ్రమలను రిజిస్ట్రేషన్ చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. జిల్లాలో రాబోయే రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ చెప్పారు. జిల్లాలో సంక్షేమ హాస్టల్స్ పర్యవేక్షణకు కేటాయించిన అధికారులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. సంక్షేమ వసతి గహాల్లో పారిశుద్ధ కార్యక్రమాలు పర్యవేక్షించాలని చెప్పారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సుబ్రహ్మణ్యేశ్వరరావు, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి రమేష్, జిల్లా మత్స్యశాఖ అధికారి గాలిదేవుడు, జిల్లా అగ్నిమాపక అధికారి వినోద్, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రాజ్ దిబోరా, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ రంగారావు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

గిరిజన హక్కుల

పరిరక్షణకు ప్రత్యేక అవార్డు

ప్రజాశకి-ఒంగోలు కలెక్టరేట్

'ధర్తీ ఆభా జనభాగీదారీ అభియాన్' పథకంలో భాగంగా గిరిజన హక్కుల పరిరక్షణ, గృహ నిర్మాణం, ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలు వారికి అమలు చేయడంలో విశేష కషి చేసినందుకు కేంద్ర ప్రభుత్వం ప్రకాశం జిల్లాకు ప్రత్యేక అవార్డును ఈ నెల 17న ఇచ్చింది. ఈ విషయమై జిల్లా గిరిజన సంక్షేమ అధికారి వరలక్ష్మి, జిల్లా గహ నిర్మాణ శాఖ అధికారి శ్రీనివాస ప్రసాద్ మంగళవారం ప్రకాశం భవనంలో కలెక్టర్ పి.రాజాబాబును కలిసి అవార్డును అందజేశారు. జిల్లాకు ఈ అవార్డు వచ్చేలా పనిచేసినందుకు జిల్లా గిరిజన సంక్షేమ అధికారి వరలక్ష్మి, జిల్లా గహ నిర్మాణ శాఖ అధికారి శ్రీనివాస ప్రసాద్‌ను కలెక్టర్ అభినందించారు. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

సబ్‌ప్లాన్ నిధులు

సక్రమంగా నియోగించండి

అధికారులకు కలెక్టర్ రాజాబాబు ఆదేశం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ నిధులను ఆ పథక అమలు వాస్తవ స్ఫూర్తితో వినియోగించాలని కలెక్టర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. ప్రకాశం భవనంలో ఎస్‌సి, ఎస్‌టి కాంపోనెంట్ ప్లాన్ 2025-26 సమావేశం మంగళవారం కలెక్టర్ అధ్యక్షతన మంగళవారం జరిగింది. వివిధ శాఖలకు ఎస్సీ, ఎస్టీ కాంపోనెంట్ నిధులను ప్రభుత్వం కేటాయించిన తీరు, జిల్లాస్థాయిలో ఆయా శాఖలవారీగా ఖర్చు పెట్టిన విధానాన్ని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఎన్.లక్ష్మా నాయక్ ఈ సందర్భంగా కలెక్టర్‌కు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కొన్ని శాఖలు లక్ష్యాలకు దూరంగా ఉండటంపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. సమావేశంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి వరలక్ష్మి, ఎస్‌సి కార్పొరేషన్ ఈడీ అర్జున్ నాయక్, అధికారులు పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళాను వినియోగించుకోండి

జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ రాజాబాబు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాజాబాబు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ (ఎపిఎస్ఎస్‌డిసి) ఆధ్వర్యంలో ఒంగోలు ఏకెవికె డిగ్రీ కళాశాలలో ఈనెల 25న జరిగే మెగా జాబ్ మేళాను నిరుద్యోగ యువతీ యువకులు వినియోగించుకోవాలని కలెక్టర్ పి.రాజాబాబు పిలుపునిచ్చారు. ప్రకాశం భవనంలోని కలెక్టర్ ఛాంబర్‌లో మంగళవారం మెగా జాబ్‌మేళాను పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెగా జాబ్ మేళాలో బహుళ జాతీయ కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. ఇంటర్, డిగ్రీ, పిజి వరకు అర్హత ఉన్న నిరుద్యోగ యువతి యువకులు ఈ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి జె.రవితేజ మాట్లాడుతూ మరిన్ని వివరాలకు 9573798594, 7842004344, ఏపిఎస్ఎస్‌డిసి కమాండ్ కంట్రోల్ నెంబర్లు 9988853335, 8712655686, 8790118349, 8790117279 మొబైల్ నెంబర్లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఎపిఎస్ఎస్‌డిసి ప్లేస్‌మెంట్ ఆఫీసర్ శ్రీనివాసాచారి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యాధికారుల సమ్మెతో

పీహెచ్‌సీ ఉద్యోగుల వేతనాలకు ఆటంకం

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పీహెచ్ సి) వైద్యాధికారులు చేపట్టిన సమ్మె ప్రభావం కారణంగా, అక్టోబర్ నెల వేతన బిల్లులకు ఏర్పడ్డ ఆటంకాన్ని తొలగించాలని యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (యుఎంహెచ్ఇయు) ఆందోళన వ్యక్తం చేసింది. ఆ మేరకు మంగళవారం యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఏ.వి. నాగేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షుడు కె. జగన్మోహనరావు, ప్రధాన కార్యదర్శి తాళ్లూరి వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు వై. సురేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి కె. శ్రీధర్ బాబు లు సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం సమ్మెలో ఉన్న పీహెచ్ సి వైద్యాధికారులు వేతన బిల్లులపై సంతకాలు చేయలేకపోవడంతో అక్టోబర్ నెల వేతనాల చెల్లింపులో ఆలస్యం తప్పదనే భయం నెలకొందన్నారు. ఈ పరిస్థితి కొనసాగితే వేలాది మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, అటెండర్,ఏఎన్ఎంలు, నర్సింగ్ సిబ్బంది మరియు ఇతర ఉద్యోగులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. వైద్యాధికారుల సమ్మెకు కారణం అయిన అంశాలు న్యాయమైనవేనని యూనియన్ అభిప్రాయపడుతూ, ప్రభుత్వం వెంటనే వారితో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఒకవేళ సమ్మె కొనసాగితే వేతన బిల్లులపై సంతకాలు, ముద్రలు ఆలస్యమవడం వల్ల వేతనాలు నవంబర్ 1న కూడా అందకపోవచ్చు అని ఆందోళన వెలిబుచ్చారు. ప్రభుత్వం తక్షణం జోక్యం చేసుకుని వైద్యాధికారుల డిమాండ్లను పరిష్కరించాలన్నారు. అదే సమయంలో, ఆరోగ్య సేవలు నిరంతరాయంగా కొనసాగేందుకు అత్యవసర పరిపాలనా చర్యలు చేపట్టాలని, ప్రభుత్వం వేతన చెల్లింపుల్లో ఆటంకం రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఫ్లాట్‌ఫారంపై చిన్నారులు..

క్షేమంగా స్వగ్రామానికి చేర్చిన పోలీసులు

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్



ఫ్లాట్‌ఫారంపై నిద్రిస్తున్న చిన్నారులు

ఓ మహిళ భర్తపై అలిగి.. చిన్నారులతో పాటు ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఫ్లాట్‌ఫాంపై దీన స్థితిలో ఉన్న చిన్నారులను పోలీసులు, ఐసిడిఎస్ సిబ్బంది గమనించి.. చేరదీశారు. వివరాలు తెలుసుకొని.. తల్లిని, చిన్నారులను క్షేమంగా వారి స్వగ్రామానికి తరలించారు.

ఈ నెల 19న రాత్రి మార్కాపురం బస్టాండ్ ఆవరణంలో గుర్తుతెలియని ఒక నలుగురు చిన్నారులు సోయ లేకుండా నిద్రపోతున్నారు. పక్కన చూస్తే.. ఎవరూ లేరు.. ఓ మహిళ తన నలుగురు చిన్నారులనూ ఇక్కడ వదిలి ఎక్కడికో వెళ్లిపోయిందని తెలుసుకున్న మార్కాపురం సర్కిల్ ఇన్స్‌పెక్టర్ పి.సుబ్బారావు, పట్టణ ఎస్ఐ ఎం.సైదుబాబు సిబ్బందితో బస్టాండ్ చేరుకొని ఆ నలుగురు చిన్నారులను చేరదీశారు. పట్టణంలోని స్ఫూర్తి వెల్ఫేర్ సొసైటీ ఆశ్రమానికి తరలించారు. అనంతరం పోలీసులు ఆ చిన్నారుల తల్లి గురించి ఆరా తీశారు. ఆమెను ఆచూకీ తెలుసుకొని.. ఆమెకు కొంత నగదు ఇచ్చి ఉదయాన్నే సొంత ఊరికి వెళ్లి పోవాలని చెప్పారు. ఆ తల్లి సోమవారం ఉదయం చిన్నారులను తీసుకొని బయటికి వచ్చేసి.. అక్కడి నుండి ఆటో తీసుకొని మార్కాపురం మండలం రాయవరం రైల్వే స్టేషన్‌కు చేరుకుంది. అక్కడ స్టేషన్ ఆవరణలో మళ్లీ ఆమె చిన్నారులను వదిలేసి.. ఎక్కడికో వెళ్లిపోయింది.. చిన్నారులు ఫ్లాట్‌ఫారంపై ఉండటాన్ని గమనించిన ప్రయాణికులు వారికి కావలసిన ఆహార పానీయాలు అందజేసి.. విషయాన్ని 'ప్రజాశక్తి' ప్రతినిధికి విషయం తెలియజేశారు. ప్రజాశక్తి ప్రతినిధి పోలీసులకు, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సువర్ణకు సమాచారం అందించారు. ఎస్ఐ అంకమ్మరావు పిల్లలకు కావాల్సిన ఆహార పానీయాలు తీసుకొని రైల్వే స్టేషన్‌కు చేరుకొని.. వారికి అందజేశారు. చిన్నారులను తన దగ్గర కూర్చోబెట్టుకొని వివరాలు రాబట్టే ప్రయత్నం చేశారు. నలుగురు చిన్నారులూ ఆరేళ్ల వయస్సు లోపు వారు కావడంతో వివరాలు సరిగ్గా చెప్పలేకపోయారు. తల్లి ఆచూకీ తెలుసుకొని.. తల్లితో సహా పిల్లలను ఒక ఆటోలో అదే ఆశ్రమానికి తరలించారు. మంగళవారం ఉదయం ఎస్సై అంకమ్మరావు, ఐసిడిఎస్ అధికారి నీలోఫర్ ఆ తల్లి స్వగ్రామం గురించి ఆరా తీశారు. ఆ తల్లిది యర్రగొండపాలెం మండలం, రేగుపల్లి గ్రామానికి చెందినదిగా గుర్తించి.. అక్కడి పోలీసుల సాయంతో తల్లిని, చిన్నారులను వారి స్వగ్రామంలోని కుటుంబసభ్యులకు అప్పగించి. వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. చిన్నారులను జాగ్రత్తగా చూసుకోవాని హెచ్చరించారు. చిన్నారులను సంరక్షించడంలో పోలీసులు, ఐసిడిఎస్ అధికారుల కృషిని మార్కాపురం ప్రజలు అభినందించారు.



చిన్నారులతో మాట్లాడుతున్న ఎస్ఐ అంకమ్మరావు

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : మంత్రి గొట్టిపాటి

ప్రజాశక్తి - సంతమాగులూరు

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, దానిలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. మండలంలోని పుట్టావారిపాలెం అడ్డరోడ్డు సమీపంలోని మంత్రి అతిథి గృహంలో మండల స్థాయి అభివృద్ధి, రైతు సమస్యలపై గ్రామాల వారీగా సమీక్ష నిర్వహించారు. ఇటీవల మృతి చెందిన టిడిపి మండల అధ్యక్షుడు గాడిపర్తి వెంకట్రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పార్టీ కార్యకలాపాల పురోగతి, గ్రామ స్థాయిలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాల అమలు పరిస్థితులపై సమీక్ష జరిపారు. పార్టీ శ్రేణులు ప్రజలతో అనుసంధానం పెంచి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా కృషి చేయాలని



మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

సూచించారు. మండలంలోని వ్యవసాయ సహకార సొసైటీ అధ్యక్షులు, వ్యవసాయ అధికారులు, సంబంధిత శాఖల అధికారులతో రైతు సమస్యలపై విస్తృతంగా చర్చ జరిపారు. రాబోయే పంట సీజన్ దృష్ట్యా ఎరువులు, విత్తనాలు సక్రమంగా సరఫరా జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. రైతులకు అవసరమైన ఇన్‌పుట్స్ సమయానికి అందేలా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ప్రజా అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రాధాన్యత క్రమంలో పనులు వేగవంతం చేయాలని అన్నారు. మండలంలోని ప్రతి గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షించారు. రోడ్లు, తాగునీరు, విద్యుత్, హౌసింగ్, స్మార్ట్ విలేజ్ ప్రాజెక్టులు వంటి అంశాలపై అధికారులు వివరాలు సమర్పించారు. నాయకులు, కార్యకర్తలతో వ్యక్తిగతంగా సమావేశమై స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో తలెత్తుతున్న సమస్యలు తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. పార్టీ బలోపేతానికి గ్రామ స్థాయి నాయకులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.



ఇరిగేషన్ ఇఇని సత్కరిస్తున్న దృశ్యం

తెనాలి ఇరిగేషన్ ఇఇకి సత్కారం

ప్రజాశక్తి - కొల్లూరు

స్థానిక ఇరిగేషన్ కార్యాలయంలో ఎఇ రవి అధ్యక్షతన మంగళవారం జరిగిన సమావేశంలో తెనాలి ఇఇ సుధాకర్‌తో రైతులు వివిధ సమస్యలపై చర్చించారు. తొలిత సాగునీటి సంఘాల సభ్యులు కుర్ర సత్యనారాయణ స్వాగత ఉపన్యాసం చేశారు. తదనంతరం ఇఇ సుధాకర్‌ను దుశ్శాలువతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సాగునీటి సంఘం అధ్యక్షులు ఎలవర్తి కోటేశ్వరావు, కాసరనేని మోహన్, మల్లంపట్టి హరి, నిమ్మగడ్డ లీలయ్య, డిఈ దీన్ దయాల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిఐ ప్రాజెక్టు డైరెక్టర్ బివి సాగర్

ఎయిడ్స్‌పై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి - అద్దంకి

హెచ్ఐవి, ఎయిడ్స్ నియంత్రణ, నిర్మూలించడంలో సమిష్టిగా అందరూ కృషి చేయాల్సిన బాధ్యత ఉందని, ఈ వ్యాధి బారిన పడకుండా ప్రజలను చైతన్యం చేయాల్సిన ఆవశ్యకత ఉందని హెల్ప్ స్వచ్ఛంద సంస్థ టిఐ ప్రాజెక్ట్ డైరెక్టర్ బివి సాగర్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, హెచ్ఐవి ఎయిడ్స్ నియంత్రణ సమీకృత వ్యూహం దిశా, హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని టొబాకో గ్రేడింగ్ మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్ప్ టిఐ ఔట్రిచ్ వర్కర్ టి దుర్గాభవాని, పీఈ మల్లేశ్వరి, పార్వతీ పాల్గొన్నారు.



శంకర్ నాయక్‌కు నివాళులర్పిస్తున్న అశోక్ బాబు

శంకర్ నాయక్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని వెల్లటూరుకు చెందిన వైసిపి సీనియర్ నాయకులు కేతావత్ శంకర్ నాయక్ సోమవారం అనారోగ్యంతో మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న వైసిపి ఇన్‌ఛార్జి వరికూటి అశోక్ బాబు వైసీపీ నాయకులతో కలిసి కేతావత్ శంకర్ నాయక్ మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు.

రేపు విద్యుత్ అదాలత్‌పై అవగాహన

ప్రజాశక్తి - చీరాల

విజయవాడ కన్స్యూమర్ గ్రీవెన్స్ రెడ్రెసల్ ఫోరం ఆధ్వర్యంలో ఈ నెల 23న వేటపాలెం మండలం కొత్తపేటలోని రావి జయలక్ష్మి, సుబ్బారాయుడు కళ్యాణ మండపంలో విద్యుత్ అదాలత్‌పై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఎఇ కె జాన్ థామస్ తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిజిఆర్ఎఫ్ చైర్మన్ విక్టర్ ఇమ్మానియేల్, బాపట్ల ఎస్ఇ, విద్యుత్ అధికారులు పాల్గొననున్నట్లు తెలిపారు. చీరాల డివిజన్ పరిధిలోని ప్రజలు పరిష్కారం కాని తమ విద్యుత్ సమస్యలు సిజిఆర్ఎఫ్ ముందు తెలియజేయాలని కోరారు. సమస్యలు అప్పటికప్పుడే పరిష్కరించే అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

పర్యాటకులలకు సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి - బాపట్ల

కార్తీక మాసంలో సూర్యలంక సముద్ర తీరానికి స్నానం ఆచరించేందుకు విచ్చేసే పర్యాటకులకు ఏ విధమైన ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ అధికారులను ఆదేశించారు. కార్తీక మాసంలో సూర్యలంక బీచ్‌కు వచ్చే పర్యాటకులకు సూర్యలంకలో సౌకర్యాల కల్పనపై చేపట్టాల్సిన కార్యక్రమాలను మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సూర్యలంక బీచ్‌లో పర్యాటకుల భద్రతకు సరిపడ గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయాలని అన్నారు. బీచ్‌కు వచ్చే సందర్శకులు సముద్ర స్నానాల అనంతరం దుస్తులు మార్చుకునే ఏర్పాట్లు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలని అన్నారు. వైద్యశిబిరం ఏర్పాటు చేసి వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని అన్నారు. అంబులెన్స్ అందుబాటులో ఉండాలని సూచించారు. కార్తీక పౌర్ణమికి సూర్యలంక బీచ్‌కు వచ్చే పర్యాటకుల రద్దీని దృష్టిలో ఉంచుకొని సూర్యలంక మార్గంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. సూర్యలంకకు వచ్చే చీరాల, పెదనందిపాడు, గుంటూరు, కర్లపాలెం వైపు నుండి సూర్యలంకకు వచ్చే వాహనాలు ఎటువైపు నుంచి దారి మళ్ళించాలో రూట్ మ్యాప్ తయారు చేసుకోవాలని అన్నారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా దారి మళ్లింపుపై చర్యలు చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో డిఎస్పీ సీతారామాంజనేయులు, ఆర్‌డిఓ పి గ్లోరియా, తహశీల్దారు సలీమా, ఎఎంసి చైర్మన్ కావూరి శ్రీనివాసరెడ్డి, జనసేనా ఇన్‌ఛార్జి వెంకట శివన్నారాయణ, టిడిపి పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నరేంద్రవర్మ

రోటరీ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - అద్దంకి

రోటరీ గవర్నర్ డాక్టర్ ఎస్‌వి రామప్రసాద్ అధికారిక పర్యటనలో భాగంగా రోటరీ కార్యాలయాన్ని సంద ర్శించారు. రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గాజులపాలెం హైస్కూల్లో, వేలమూరిపాడు రోడ్డులోని రోటరీ పార్కులో మొక్కలు నాటారు. సింగరకొండలో జరిగిన సభలో శ్రీరామ వృద్ధుల ఆశ్రమానికి సీనియర్ రొటేరియన్ జాగర్ల మూడి శివకుమారి ఇచ్చిన రూ.2లక్షల విరాళం, కాకతీ య సేవా సత్రం వద్ద గల వినాయక స్వామి మందిరా నికి ఇచ్చిన రూ.లక్ష విరాళం రావూరి రంగయ్య, సందిరెడ్డి శ్రీనివాసరావుకు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో డాక్టర్ రాంప్రసాద్ మాట్లాడుతూ రోటరీ సంస్థ ప్రపంచ వ్యాప్తంగా సేవలు అందిస్తున్నదని అన్నారు. రోటరీ ఫౌండేషన్‌కు నిధులు సమకూర్చి రోట రీని బలోపేతం చేయాలని అన్నారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు బాచిన శివధర పూర్ణచంద్రరావు, సెక్రటరీ అలహరి హరిప్రసాద్, తమ్మన శ్రీనివాసరావు, డాక్టర్ ఫణింద్ర బాబు, పిఎల్‌వి నరసింహారావు, పి ఉదయ భాస్కర్, సందిరెడ్డి శ్రీనివా సరావు, అద్దంకి లేవి ప్రసాద్, షేక్ మొహమ్మద్ రఫీ, నర్రా శ్రీలక్ష్మి, జాగర్లమూడి శివకుమారి, కొల్లా భువ నేశ్వరి, చప్పిడి వీరయ్య, కాకర్ల వెంకటేశ్వర్లు, మల్లాది శ్రీనివాసరావు, లక్ష్మీరెడ్డి, పసుపులేటి ఆంజనేయులు, పువ్వాడ రామకోటేశ్వరరావు, వూటుకూరి రామకోటేశ్వ రరావు, అన్నంగి సుబ్బారావు, చుండూరి మురళి సుధా



మొక్కలు పంపిణీ చేస్తున్న రోటరీ ప్రతినిధులు

రేషన్ బియ్యం సక్రమంగా పంపిణీ చేయాలి

ప్రజాశక్తి - చీరాల

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం లబ్ధిదారులకు సకాలంలో డీలర్లు సమయపాలన పాటించి పంపిణీ చేయాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని తహశీల్దారు గోపికృష్ణ అన్నారు. స్థానిక తహశీల్దారు కార్యాలయంలో రేషన్ డీలర్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రేషన్ బియ్యం సక్రమంగా పంపిణీ చేయడంతో పాటు సమయపాలన పాటించాలని అన్నారు. లబ్ధిదారులకు అసౌకర్యం కలగకుండా స్నేహశీలిగా మాట్లాడుతూ పంపిణీ చేయాలని అన్నారు. డీలర్లు అందరూ సిఎఫ్ఎంఎస్ ఐడిలు నమోదు చేసుకోవాలని అన్నారు. నిర్ణీత గడువులోపే డీలర్లు డీడీలు సకాలంలో చెల్లించలని కోరారు. రికార్డులన్నీ సక్రమంగా నిర్వహిస్తూ అవకతవలు లేకుండా రేషన్ సరుకులు పంపిణీ చేయాలని అన్నారు. స్మార్ట్ కార్డులు తీసుకోని లబ్ధిదారులను గురించి పంపిణీ చేయాలని అన్నారు. కార్యక్రమంలో సిఎస్ డిటి ఓంకార్ పాల్గొన్నారు.



గాయపడ్డ పారిశుద్ధ్య కార్మికుడు హరిబాబు

పారిశుద్ధ్య కార్మికుడికి గాయాలు

ప్రజాశక్తి - అద్దంకి

పురపాలక సంఘం పారిశుద్ధ్య విభాగంలో పనిచేస్తున్న మున్నంగి వెంకట్రావు పట్టణంలోని కొత్త దామావారి పాలెంలో రామాలయం వద్ద పారిశుద్ధ్య విధులు నిర్వహిస్తుండగా జారి కాలువలో పడిపోవడంతో గాయాలు అయ్యాయి. స్థానికులు వెంటనే 108 సమాచారం అందించడంతో బాధితుడు ఎంటి హరిబాబును ప్రథమ చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పేదలకు తప్పని నీటి కష్టాలు

ప్రజాశక్తి - యద్దనపూడి



నీటిని కవటితో మోసుకొస్తున్న కాలనీ వాసులు

మండలంలోని అనంతవరం పేదలకు నీటి కష్టాలు తప్పడం లేదు. ఎస్‌సిలను కేవలం ఓటర్లుగా మాత్రమే అధికార పార్టీల నాయకులు చూస్తున్నారు. గ్రామంలో 53ఏళ్ల క్రితం ప్రభుత్వం పేదలకు నివేశ స్థలాలు ఇచ్చి కాలనీ నిర్మించారు. అయితే మౌలిక వసతులు ఇప్పటికి కల్పించలేదు. త్రాగు నీరు, సరైన డ్రైనేజి వ్యవస్థ, సిసి రోడ్లు కనపడటం లేదు. ఎస్‌సి కాలనీ వాసులు ఎన్నో పోరాటాలు, ధర్నాలు చేసి ప్రభుత్వ అధికారులను ఒప్పించి ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు సాధించుకున్నారు. ఆ ట్యాంకు ప్రారంభించినప్పటి నుండి రక్షిత త్రాగు నీరు రావడం లేదు. శుద్ధి చేయని నీళ్లు వస్తున్నాయని ఆవేదనగా తెలిపారు. ఉన్నత వర్గాల ప్రాంతాల్లో ఏదైనా త్రాగు నీటి పైపులైన్, డ్రైనేజి కాలువలు మర్మత్తులకు గురైతే వాటి మరమత్తులు వేటంటే పూర్తి చేస్తారు. అదే పెదలైన్ ఎస్‌సి, ఎస్‌టి ప్రాంతాల్లో మాత్రం ఏదైనా సమస్య వస్తేమాత్రం రోజులు గడవాల్సి వస్తుంది. గత ప్రభుత్వంలో ఎస్‌సిలకు నిర్మించిన ట్యాంకు నుండి ప్రక్కనే ఉన్న పోగాకు గోడౌన్‌కు ట్యాంకు నుండి నీళ్లు ఇస్తామంటే ఎస్‌సిలు అభ్యంతరం చెబితే పోగాకు గౌడన్‌కు పైపు లైన్ వేయకుండా నిలుపుదల చేశారు. కానీ కొత్త ప్రభుత్వలో అధికారులు కనీసం కాలనీ వాసులు చెప్పకుండా వారి అభిప్రాయం అడగగా పోగాకు కంపేనికి ట్యాంకు నుండి పైపులైన్ వేశారని పేదలు అంటున్నారు. గ్రామ అభివృద్ధి అంటే అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలని అన్నారు. గ్రామంలో నీటి సమస్య పరిష్కరించాలని, నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామంలో అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వం కల్పించే సౌకర్యాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరారు.

పంచాయతీ ఎన్నికల సందడి మొదలు

ప్రజాశక్తి - వేటపాలెం

ఎన్నికల వాతావరణం మొదలైంది. కొత్తపేటలో చురుగ్గా కదలికలు మొదలయ్యాయి. రాష్ట్ర ఎన్నికల సంఘం మంగళవారం షెడ్యూల్ విడుదల చేసింది. పంచాయతీ సాధారణ ఎన్నికలు నిర్వహించనున్నారు. రిటర్నింగ్ ఆఫీసరు అక్టోబర్ 23న ఎన్నికల నోటీసు జారీ చేస్తారు. అదే రోజు వార్డు వారీగా ఓటర్ల జాబితా ప్రదర్శించనున్నారు. నామినేషన్లు అక్టోబర్ 23 నుంచి 25 వరకు స్వీకరించనున్నారు. నామినేషన్ల పరిశీలన అక్టోబర్ 26న నుంచి ప్రారంభం అవుతుంది. తిరస్కరించిన నామినేషన్లపై అక్టోబర్ 27న అప్పీలుకు చీరాల ఆర్‌డిఒకు సమర్పించవచ్చు. అక్టోబర్ 28న అప్పీల్ పరిష్కారం చేయనున్నారు. అక్టోబర్ 29న అభ్యర్థిత్వం ఉపసంహరణ, అదే రోజు మధ్యాహ్నం 3 గంటల తరువాత పోటీలో ఉన్న అభ్యర్థులను ప్రకటిస్తారని తెలిపారు. నవంబర్ 3న ఓటింగ్ జరగనుంది. అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుండి లెక్కింపు ప్రారంభం అవుతుంది. ఫలితాల లెక్కింపు పూర్తయిన వెంటనే ప్రకటిస్తారు. ఫలితాలు ప్రకటించిన రోజునే ఉపసర్పంచి ఎన్నిక నిర్వహించనున్నారు.

కరువు భత్యంపై అసంబద్ధ జీవోలు సవరించాలి

ప్రజాశక్తి - బాపట్ల

కరువు భత్యం (డిఎ)పై విడుదల చేసిన అసంబద్ధ జీఓలు 60, 61 తక్షణమే సవరించాలని ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు బడుగు శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి గుడివాడ అమర్నాథ్ మంగళవారం తెలిపారు. ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక పోరాటాల ద్వారా ప్రభుత్వం ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలతో గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ చర్చలు జరిపి సిఎం ద్వారా జనవరి 1 నుండి ప్రకటించిన కరువు భత్యం (డిఏ)పై సర్వీసు ఉద్యోగులకు విడుదల చేసిన జిఒ 60, పెన్షనర్స్‌కు విడుదల చేసిన జిఒ 61 లో తెలిపిన అసంబద్ధ అంశాలు వెంటనే సవరించి సరైన ఉత్తర్వులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉన్న కాలంలో ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు అనేక హామీలు ఇచ్చి వారి మద్దతుతో అధికారంలోకి వచ్చి 16 నెలలు గడిచినా హామీలపై ఊసే ఎత్తడం లేదని అన్నారు. ఫ్యాప్టో ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అక్టోబర్ 7న పోరు బాట ఉద్యమ ఫలితంగా ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక విజయవాడలో పోరుబాట నిర్వహిస్తే దాని తరువాత 18న గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులతో చర్చలు జరిపి ఒక డిఏ ఇప్పుడు ఇస్తామని, పిఆర్‌సి, సిపిఎస్, సరెండర్ లీవ్ తదితర సమస్యలు దశల వారీగా పరిష్కరిస్తామని ఈ నెల 20న విడుదల చేసిన జిఒలు 60, 61లో ప్రస్తుత సర్వీసు ఉద్యోగులకు 21 నెలల డిఎ అరియర్స్ పదవీ విరమణ సమయంలో చెల్లిస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. 10, 20, 30 ఏళ్ళ తరువాత ఉద్యోగ విరమణ పొందేవారు బకాయిల కోసం అప్పటి వరకు వేచి ఉండాలాని ప్రశ్నించారు. ఈపాటికే ఉద్యోగ విరమణ పొందినవారికి 27- 28 ఆర్థిక సంవత్సరంలో 12 వాయిదాల్లో చెల్లిస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. చర్చల్లో చెల్లింపులపై చర్చించ కుండా ఉద్యోగ విరమణ సమయంలో ఇస్తామని జిఒ విడుదల చేయడం గత ప్రభుత్వం ఇచ్చిన రివర్స్ పిఆర్‌సి వంటిదేనని అన్నారు. వెంటనే జిఒ 60,61 సవరించి డిఎ బకాయిలు, ఉద్యోగుల ప్రావిడెంట్ ఖాతాలకు జమచేయాలని కోరారు. సిపిఎస్, ఉద్యోగ విరమణ పొందినవారికి సింగిల్ పేమెంట్ చేయాలని కోరారు. లేని పక్షంలో మరో ఉద్యమానికి సంసిద్ధం కావాల్సి వస్తుందని హెచ్చరించారు.

పర్చూరు : ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతో మంత్రుల బృంధం చర్చించి ఇచ్చిన డిఎ జిఒను తక్షణం సవరించాలని హిందీ టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వనిమిరెడ్డి విజయకుమార్, సదానంద బాబు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్ హనుమంతరావు, శివకుమారు తెలిపారు. డిఎ జిఒ ద్వారా వచ్చే అరియర్స్ ఉద్యోగ విరమణ చేసిన తర్వాత ఇస్తామనటం పట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నామని తెలిపారు. సిపిఎస్ ఉద్యోగులకు సంబంధించి ఈ జిఒలో ఎక్కడా ప్రస్తావించకపోవడం సరికాదని తెలిపారు. ఉద్యోగ విరమణ చేసిన వారికి 2027- 28లో 12 వాయిదాల్లో బకాయిలు చెల్లిస్తామనడాన్ని ఖండిస్తున్నామని అన్నారు. ఇప్పటికైనా సవరణ చేసి ఉద్యోగులకు డిఎ అరియర్స్ వారి పిఎఫ్ ఖాతాలకు, సిపిఎస్ ఉద్యోగులు, పెన్షనర్లకు తక్షణం సొమ్ము రూపంలో చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

కొత్తపేటలో ఎన్నికల పండగకు రంగం సిద్ధం

- నాలుగున్నర ఏళ్ల నిరీక్షణకు తెర
- గ్రామంలోని ఓటర్లలో ఉత్సాహం



కొత్తపేటలో ఫ్లెక్సీలు తొలగిస్తున్న పంచాయితీ సిబ్బంది

ప్రజాశక్తి - వేటపాలెం

నాలుగున్నరేళ్లుగా ఎదురుచూస్తున్న కొత్తపేట ప్రజలకు ఎన్నికల పండుగ రానుంది. అధికారులు ఏర్పాట్లు పూర్తి చేయడంతో గ్రామంలో రాజకీయ చర్చలు మళ్ళీ చురుగ్గా మొదలయ్యాయి. ఓటర్ల జాబితాలు సవరించబడి, పోలింగ్ బూత్‌లు కేటాయించబడ్డాయి. నవంబర్ 3న ఎన్నికల తేదీని ఎన్నికల సంఘం ప్రకటించింది. కొత్తపేట పంచాయతీ లో 11,500 మంది ఓటర్లు, 16 వార్డులు, 32 పోలింగ్ బూత్‌లు ఉన్నాయని అధికారులు తెలిపారు. గతంలో పంచాయితీ పునర్విభజన అంశంపై కోర్టు వివాదాల కారణంగా నియోజకవర్గంలోని 23 పంచాయతీలు, ఎంపీటీసీ ఎన్నికలు నిలిచిపోయాయి. మండలంలో 9పంచాయతీలు ఉండగా వేటపాలెం, దేశాయిపేట, కొత్తపేట ప్రధాన పంచాయతీలు ఉన్నాయి. ఈ మూడు పంచాయతీల్లో 16 శివారు గ్రామాలు ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 2021 ఫిబ్రవరిలో పంచాయతీ ఎన్నికలు పూర్తవగా చీరాల రూరల్, వేటపాలెం మండలాల్లో మాత్రం ఎన్నికలు జరగలేదు. అప్పట్లో తెలుగుదేశం స్థానిక నాయకుల మధ్య జరిగిన ఆధిపత్య పోరు కారణంగా ఎన్నికల ప్రక్రియ నిలిచిపోయిందని రాజకీయ వర్గాల్లో చర్చ జరిగింది. ఆ ఘటనతో గ్రామ ప్రజాస్వామ్య హక్కులు నాలుగేళ్లకుపైగా నిలిచిపోయాయి. ఇప్పుడు పరిస్థితులు మారడంతో అధికారులు షెడ్యూల్ సిద్ధం చేశారు. గ్రామ ప్రజల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. నాలుగేళ్ల తర్వాత ఓటు హక్కు వినియోగించే అవకాశం రావడం పండుగేనని గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సౌత్ జోన్ ఖోఖో క్రీడాకారులకు శిక్షణ



సౌత్ జోన్ ఖో ఖో పోటీల్లో పాల్గొన్న ఎపి బాలుర జట్టు

ప్రజాశక్తి - పంగులూరు

ఎపి ఖో ఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న సౌత్ జోన్ ఖోఖో పురుషుల జట్టు శిక్షణ శిబిరం మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఎంపికైన పురుషుల జట్టుకు ఎస్‌ఆర్ స్పోర్ట్స్ వేర్ అధినేత మేకల శ్రీరాంరెడ్డి క్రీడా దుస్తులు బహుకరించారు. క్రీడా దుస్తులను సిఐ వై పాలరాజు చేతుల మీదగా క్రీడాకారులకు అందజేశారు. గత వారం రోజులుగా గ్రామ పెద్దల సహాయ సహకారాలతో ఎస్‌ఆర్‌ఆర్ ఖో ఖో అకాడమీ మాగుంట సుబ్బరామిరెడ్డి, బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాల క్రీడ ప్రాంగణంలో శిక్షణ క్యాంపు నిర్వహించారు. క్యాంపు నిర్వహణకు కారకులైన ఖో ఖో అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ బాచిన గరటయ్య, టిఎస్‌ఆర్‌కె ప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలియజేయనున్నట్లు తెలిపారు. ఎంపికైన టీంకు ఎస్‌కె ఆలి నవాజ్ కోచ్‌గా, ఎన్ అజయ్ కుమార్ మేనేజర్‌గా వ్యవహరిస్తారని తెలిపారు. ఎంపికైన టీం ఈ నెల 24 నుండి 26వరకు కర్ణాటకలోని దావనగిరిలో సౌత్ జోన్ నేషనల్ పోటీలు నిర్వహిస్తారని అధ్యక్ష, కార్యదర్శులు వివరించారు. ఈ సందర్భంగా ప్రకాశం జిల్లా కార్యదర్శి కాశీ విశ్వనాద్‌రెడ్డి, అధ్యక్షులు కె భాస్కరరావు, ట్రెజరర్ కె హనుమంతరావు రాష్ట్ర టీం మెడల్ సాధించి మంచి పేరు తీసుకురావాలని క్రీడాకారులను కోరారు.

ఎంపికైన క్రీడాకారులు

రాష్ట్ర జట్టుకు పి సూరి నాయుడు (ప్రకాశం), కె మహేష్ (ప్రకాశం), ఎన్ షాలోం రాజు (ప్రకాశం), వై సుధీర్ కుమార్ (ప్రకాశం), ఎస్‌కె మహమ్మద్ (ప్రకాశం), ఐ ఏలియా (ప్రకాశం), ఎం ఫణి కుమార్ (రైల్వే), కె కొండలరావు (కృష్ణ), బి కిరణ్ (విశాఖపట్నం), జి శాంతి (అనంతపురం), కర్రీ శివశంకర్ (తూర్పుగోదావరి), కె ప్రవీణ్ (రైల్వే), పి వరుణ్ (చిత్తూరు), వై ఆశిష్ కుమార్ (నెల్లూరు), బి సింహాద్రి నాయక్ (గుంటూరు) ఎంపికయ్యారు.

జాగ్రత్త కన్నా జరిమానాలే ఎక్కువ

- హైవేపై ద్విచక్ర వాహనదారుల అవస్థలు
- పోలీసుల చర్యలపై విమర్శలు



కానిస్టేబుల్ చేతిలో ట్యాబ్ ఎస్ఐ తీసుకునే ప్రయత్నం

ప్రజాశక్తి - వేటపాలెం

ఇటీవల జాతీయ రహదారిపై ప్రమాదాలు పెరిగాయి. ఆ ప్రమాదాలను సాకుగా తీసుకుని నివారణ పేరుతో పోలీసుల వేధింపులు, ఆ కారణంగా ప్రమాదకర పరిస్థితులు పెరిగాయి. హైవేపై ద్విచక్ర వాహనదారులు కష్టాల్లో పడ్డారు. పోలీసు జరిమానాలు పెరిగాయి. జాగ్రత్తల కంటే పోలీసుల జరిమానాల భయమే ఎక్కువైంది. వేటపాలెం ప్రధాన సెంటర్ నుండి డిగ్రీ కాలేజీ వైపు వెళ్లే 216 జాతీయ రహదారి జంక్షన్ వద్ద రాత్రివేళల్లో వాహనాలు ఆకస్మికంగా పోలీసులు ఆపి కేసులు నమోదు చేస్తున్నారు. హెచ్చరిక బోర్డులు, లైట్లు లేకుండా హైవేపై వాహనాలను ఆపివేయడం ప్రమాదాలకు దారితీస్తోందని ప్రజలు చెబుతున్నారు. సేఫ్టీ పేరుతో ఇబ్బందులే పెరుగుతున్నాయని డ్రైవర్లు మండి పడుతున్నారు. ట్రైనీ ఎస్ఐ ఆధ్వర్యంలో 10 రోజులుగా ఉదయం, సాయంత్రం తనిఖీలు చేస్తున్నారు. కేసులు నమోదు చేయడం, జరిమానాలు విధించడం ప్రజల్లో అసహనానికి దారితీస్తోంది. వాహనాలను ఫోటో తీసి ఆన్లైన్లో కేసు నమోదు చేసి వెంటనే జరిమానా కట్టాలని పోలీసులు డిమాండ్ చేస్తున్నారు. సాయంత్రం 5గంటల నుంచి రాత్రి 8 వరకు కొనసాగుతున్న ఈ తంతు వీధిలైట్లు లేకపోవడంతో ప్రమాదకరంగా మారిందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేతిలో లాటి లేకుండా పోలీసులు చలానా ట్యాబ్‌తో కేసులు నమోదు చేయడం విచిత్రమని అంటున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం లాటి లేకుండా విధులు నిర్వహించ రాదన్న నిబంధన ఎవరూ పాటించడం లేదని అంటున్నారు. న్యాయ నిపుణులు నేషనల్ హైవేపై వాహనాలు ఆపి జరిమానాలు విధించే అధికారం సాధారణ సివిల్ పోలీసులకు లేదు. ప్రత్యేక సందర్భాల్లో ఉన్నతాధికారుల అనుమతి మేరకే సివిల్ పోలీసులు హైవే ఎక్కాల్సి ఉంటుంది. ఆ అధికారం ట్రాఫిక్ పోలీసులు లేదా ఆర్‌టీఓ అధికారులకే ఉందని స్పష్టం చేస్తున్నారు. రోడ్డు భద్రతా నిపుణులు జంక్షన్ వద్ద వాహనాలు నిలిపివేయడం రహదారి భద్రతా ప్రమాణాలకు విరుద్ధమని హెచ్చరిస్తున్నారు. ఉన్నతాధికారులు వెంటనే జోక్యం చేసుకుని విచక్షణ రహిత చర్యలు నిలిపివేయాలని ప్రజలు కోరుతున్నారు.



పరామర్శిస్తున్న లిడ్‌క్యాప్ ఛైర్మన్ మాణిక్యరావు

సుధాకర్ కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - మేదరమెట్ల

ఎంఆర్‌పిఎస్ కొరిశపాడు మండల మాజీ అధ్యక్షుడు ప్రేమల సుధాకర్ కుటుంబాన్ని ఎపి లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు మంగళవారం పరామర్శించారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సుధాకర్ మృతి చెందారు. మేదరమెట్లలోని ఆయన స్వగృహంకు చేరుకొని సుధాకర్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఎంఆర్‌పిఎస్ ఉద్యమ ప్రారంభంలో సుధాకర్ అందించిన సేవలు స్మరించుకున్నారు. వారి కుటుంబానికి తమ ప్రగాఢ సంతాపం తెలిపారు. కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు కొమ్ము సుజన్, జాతీయ సఫాయి మజ్దూర్ కాంగ్రెస్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ గద్దె త్యాగరాజు, సఫాయి మజ్దూర్ కాంగ్రెస్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పొగడ్త నారాయణ, ఎంఎస్‌పిఎస్ ప్రతినిధులు కొలకలూరి విజయ్ కుమార్, చాట్ల మహేష్, టిడిపి నాయకులు మంద అమోస్, నరసింహ, కొమ్ము ప్రసాద్, మహాజన సోషలిస్ట్ పార్టీ అద్దంకి నియోజకవర్గ ఇంచార్జి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నీటిపారుదల సమస్య పరిష్కరించాలి

ప్రజాశక్తి - చీరాల

మండలంలోని ఈపురుపాలెం స్ట్రెయిట్‌కట్, బైపాస్ రోడ్డు క్రింద సరైన నీటి పారుదల సౌకర్యం లేకపోవడంతో కుందేరు నీరు వెనక్కి చేరి ఈపురుపాలెం, తోటవారిపాలెం పంచాయతీలోని పంట భూములు, నివాస ప్రాంతాలు నీటమునిగి పెద్దఎత్తున ఇబ్బందులు కలుగుతున్నాయని ప్రజా సంఘాల నాయకులు కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్‌ను బాపట్లలో కలిసి మంగళవారం వినతి పత్రం అందజేశారు. కుందేరు నీరు నిరోధించకుండా సమర్థవంతంగా పారేలా సైఫన్ ఏర్పాటు చేయాలని కోరారు. పాత డ్రైనేజ్ లైన్లను శుభ్రం చేయాలని, బైపాస్ రోడ్డు కింద కొత్త కల్వర్ట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. నీటి నిల్వ ఉండడం వల్ల దోమలు పెరిగి మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్ త్వరలోనే స్థలాన్ని స్వయంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ప్రజల ఆరోగ్య భద్రత దృష్టిలో ఉంచుకుని సమస్య పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజాసంఘాల నాయకులు గుమ్మడి ఏసురత్నం, గూడూరు శివరాం ప్రసాద్, నలతోటి బాబురావు, భగవాన్ దాస్, గుమ్మడి సూర్యప్రకాష్ పాల్గొన్నారు.



బియ్యం పంపిణీ చేస్తున్న చాట్రాసి ట్రస్ట్ ప్రతినిధులు

పేదలకు అండగా చాట్రాసి ట్రస్ట్

ప్రజాశక్తి - చీరాల

నిరు పేదలకు సాయం అందిస్తూ వారి ఆర్థిక అవసరాలు గుర్తించి చాట్రాసి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా చైర్మన్ చాట్రాసి రాజేష్ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ట్రస్ట్ నిర్వాహకులు చాట్రాసి బాల వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని విజయలక్ష్మిపురంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కొండూరి కామేశ్వరరావు కుటుంబానికి ట్రస్టు ద్వారా చేయూత అందించారు. మృతి చెందిన కామేశ్వరరావు నిరుపేద కుటుంబానికి చెందిన వ్యక్తి కావడంతో వారి అవసరాన్ని గుర్తించి ఆయన దశదిన కర్మకు అవసరమైన వంద కేజీల బియ్యం బస్తాలు ట్రస్టు ద్వారా కుటుంబ సభ్యులకు అందించారు. పేదలకు తమ వంతు సాయం అందించడమే లక్ష్యంగా ట్రస్ట్ కార్యక్రమాలు నిర్వహిస్తుందని అన్నారు.

త్వరలో బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ

మంత్రి డోలాశ్రీ బాల వీరాంజనేయస్వామి

ప్రజాశక్తి-కనిగిరి

త్వరలో ఎస్సీ, ఎస్టి, బీసీ మైనారిటీ బ్యాక్లాగ్ పోస్టులను కూడా భర్తీ చేయడం జరుగు తుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి తెలిపారు. కనిగిరి మండలం కంచర్లవారిపల్లి జడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో రూ.69.85 లక్షలతో నిర్మించిన వసతి గహాన్ని మంత్రి స్వామి మంగళవారం నాడు ప్రారంభించారు. వసతిగహాన్ని, కల్పించిన వసతులను ఆయన పరిశీలించారు. అనంతరం కనిగిరి పట్టణంలోని అమరావతి గ్రౌండ్ లో ఉచిత కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న 140 మంది మహిళలకు ఉచిత కుట్టు మిషన్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొంత నిధులు మరియు దాతల సహకారంతో సేవా కార్యక్రమాలు ఎక్కువగా జిల్లాలో చేస్తున్నది ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అని అన్నారు. అనంతరం కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని గార్లపేట రోడ్డులో గల ఎస్సీ బాలుర వసతి గహం-2లో చేపట్టిన అభివద్ధి పనుల ను మంత్రి స్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ మంత్రి సహకారంతో వసతి గహాలను, పాఠశాలలను అభివద్ధి చేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డిఓ కేశవర్ధన్ రెడ్డి, డి.ఎస్.పి పి సాయి ఈశ్వర్ యశ్వంత్, డి డి ఓ కే శ్రీనివాసరెడ్డి, ఏఎంసీ చైర్మన్ యారవ రమా శ్రీనివాసులు, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, కనిగిరి పట్టణ అధ్యక్షులు షేక్ ఫిరోజ్, పట్టణ యూత్ అధ్యక్షులు అచ్చాల రవి, మండల పార్టీ అధ్యక్షులు కొండా కష్ణారెడ్డి, మండల పార్టీ కన్వీనర్ పిచ్చాల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



కుట్టుమిషన్లను పంపిణీ చేస్తున్న మంత్రి స్వామి



విద్యార్థులతో మంత్రి స్వామి

పోలీస్ అమరవీరుల త్యాగాలను

ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలి..

కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్



అమరవీరుల సంస్మరణ దినోత్సవ ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎస్పీ

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

దేశ రక్షణలో ప్రాణాలను అర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలను ప్రతి ఒక్కరు స్మరించుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ తెలిపారు. మంగళవారం బాపట్ల పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో అమర జవాన్ స్తూపం వద్ద ఏర్పాటుచేసిన పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై, గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అక్టోబర్ 21వ తేదీన దేశమంతా వీర పోలీస్ సిబ్బందికి గౌరవంగా నమస్కరిస్తుందన్నారు. పోలీస్ వారి ధైర్యం, త్యాగం, కర్తవ్య నిబద్ధత వల్లే మన సమాజం నేడు శాంతి, భద్రతలతో జీవిస్తోందన్నారు. పోలీస్ శాఖ దేశ అంతర్గత భద్రతకు మూల స్థంభమని, ప్రజాస్వామ్యానికి రక్షకులని తెలిపారు.ఉత్సవాలు, ఎన్నికలు, ఉగ్రవాదం, నక్సలిజం, ట్రాఫిక్ నియంత్రణ, మహిళా భద్రత, ప్రకతి విపత్తుల సమయంలో ప్రతి చోటా పోలీస్ శాఖ ముందుంటుందని ఆయన చెప్పారు.

జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ బి.ఉమామహేశ్వర్ మాట్లాడుతూ అక్టోబర్ 21వ తేదీన పోలీసుల అమరవీరుల సంస్కరణ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. దేశవ్యాప్తంగా మావోయిస్టులు, ఉగ్రవాదులు, అసాంఘిక శక్తులతో పాటు విధి నిర్వహణలో భాగంగా అల్లర్లు, అలజడుల్లో కీలక విధులు నిర్వహించి ప్రాణాలు అర్పించిన పోలీసు సిబ్బందిని స్మరించుకుంటూ నివాళులు అర్పించేందుకు స్మతి పెరేడ్ నిర్వహించి అమరులకు శ్రద్ధాంజలి ఘటిస్తున్నామని ఆయన తెలిపారు. పోలీస్ శాఖ విధులు ఎంతో భిన్నంగా ఉంటాయని, పగలు రాత్రి తేడా లేకుండా, ఎండా,వాన లెక్కచేయకుండా శాంతి భద్రత,ప్రజల హక్కుల పరిరక్షణ కోసం 24/7 నిరంతరంగా సేవలందించేది పోలీస్ వ్యవస్థ మాత్రమేనని ఆయన తెలిపారు. గత ఏడాది 1.9. 2024 నుండి 31.8.2025 వరకు దేశవ్యాప్తంగా అమరులైన వీర జవానుల పేర్ల లిఖించిన రోల్ ఆఫ్ ఆనర్ పుస్తక ట్రోలి లోని పేర్లను ఏఆర్ డిఎస్పి విజయసారథి చదివి వినిపించారు. పోలీస్ స్మారక స్థూపం వద్ద పుష్పగుచ్చాలను సమర్పించి వీర జవాన్లకు నివాళులు అర్పించారు. అమరవీరుల కుటుంబ సభ్యులకు ధ్రువీకరణ పత్రాలు, బహుమతులు అందించారు. ౧. ఈ ర్యాలీలో పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. అంబేద్కర్ సెంటర్లో మానవహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం లో బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు, బాపట్ల డిఎస్పి రామాంజనేయులు, రేపల్లె డిఎస్పి శ్రీనివాసరావు, చీరాల డిఎస్పి మోయిన్, బాపట్ల రెవెన్యూ డివిజన్ అధికారి పి గ్లోరియా, తహసిల్దార్ సలీమా, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎరువులను

అధిక మోతాదులో వాడనీయొద్దు..

కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

అధిక మోతాదులో ఎరువుల వాడకంను నియంత్రించే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ అధికారులకు సూచించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని మినీ వీక్షణ సమావేశం మందిరంలో జిల్లా కలెక్టర్ జిల్లా స్థాయి భూమాత రక్షణ కమిటీ సమావేశం నిర్వ హించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా అం తటా ఎరువుల వాడకాన్ని పరిశీలించి సమ తుల్య వినియోగం కోసం ప్రత్యేక ప్రచారాలను చేపట్టాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవ సాయ అధికారి సుబ్రహ్మణ్యేశ్వర రావు, ఏ ఏ ఓ అన్నపూర్ణ, గుంటూరు జడ్పీ డిప్యూటీ సీఈవో కష్ణ, బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు, ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నైపుణ్యాల అభివృద్ధి కోసం ప్రత్యేక శిక్షణ

యువతలో నైపుణ్యాల అభివద్ధి కోసం ప్రత్యేక శిక్షణలు బాపట్లలో నిరంతరం కొనసాగాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ తెలిపారు. ఏపీ నైపుణ్యాభివద్ధి సంస్థ జిల్లా స్థాయి కమిటీ సమావేశం మంగళవారం స్థానిక కలెక్టర్ లో జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యం మేరకు నాణ్యతా ప్రమాణాలతో శిక్షణలు నిర్వహించాలని కలెక్టర్ చెప్పారు. నైపుణ్యాభి వృద్ధి సంస్థ ద్వారా జిల్లాలో 720 మందికి శిక్షణలు ఇవ్వాలన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధి కల్పన అధికారి రాజారావు, డి ఆర్ డి ఎ పి డి లవన్న, జిల్లా నైపుణ్యాభివద్ధి సంస్థ అధికారి మాధవి పాల్గొన్నారు.

'ఎస్సీ' గ్రామాలలో మౌలిక సదుపాయాల కల్పన

ప్రధానమంత్రి ఆదర్శ యోజన కింద గుర్తించిన గ్రామాలను అభివద్ధి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ తెలిపారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో అమలవుతున్న ప్రభుత్వ సంక్షేమ, అభివద్ధి కార్యక్రమాలపై సంబంధిత జిల్లా, మండల స్థాయి అధికారులతో మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్ రావు, జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారి రాజా దిబోరా, పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ వేణుగోపాల్, ఆర్ డబ్ల్యు ఎస్ ఎస్ఈ అనంతరాజు, గహ నిర్మాణ శాఖ పిడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రుచికరమైన భోజనం అందించాలి

అన్నా క్యాంటీన్ లో ప్రజలకు రుచికరమైన భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక సూర్యలంక రోడ్ లోని అన్నా క్యాంటీన్ ను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అన్న క్యాంటీన్ లో మెనూ అమలు చేస్తున్నారా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అన్నా క్యాంటీన్ లో భవన నిర్మాణ కార్మికులతో కలిసి జిల్లా కలెక్టర్ భోజనం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ డి.ఇ శ్రీనివాసరావు, శానిటరీ ఇన్స్పెక్టర్ కరుణ పాల్గొన్నారు.

కుష్టు నిర్మూలనకు చిత్తశుద్ధితో పనిచేయాలి..

కుష్టు వ్యాధి నిర్మూలనకు చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా కలెక్టర్ వి.వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ లో జిల్లాస్థాయి కుష్టు వ్యాధి నిర్మూలన కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నవంబర్ 30వ తేదీ వరకు కుష్టు వ్యాధి నిర్మూలనపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆయన అధికారులకు సూచించారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి విజయమ్మ, జిల్లా లెప్రసీ ఎయిడ్స్, టీబి కంట్రోల్ అధికారి సోమల్లా నాయక్ , జిల్లా విద్యాశాఖ అధికారి పురుషోత్తం, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, జి.ఎస్. డబ్ల్యూ జిల్లా కోఆర్డినేటర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

బీచ్‌లు ఆహ్లాదకరంగా ఉండేలా చూడాలి

కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

పర్యాటకులకు ఆహ్లాదకరంగా, స్నేహ పూర్వకమైన వాతావరణంలో బీచ్‌లు ఉండేలా అభివద్ధి చేయాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ తెలిపారు. పర్యాటకులను ఆకర్షించే అంశంపై సంబంధిత శాఖల అధికారులతో మంగళవారం వీక్షణ సమావేశంలో కలెక్టరేట్‌లో జరిగింది. బాపట్ల జిల్లా, పర్యాటక రంగానికి చాలా కీలకమైందిగా ఉందని కలెక్టర్ చెప్పారు. ఆరు మండలాలలో సముద్ర తీర ప్రాంతం ఉందన్నారు. సముద్ర తీర ప్రాంతాలైన 17 పంచాయతీలలో బహిరంగ మలమూత్ర విసర్జన నిషేధిస్తున్నట్లు ప్రకటించారు. ఎనిమిది పంచాయతీ పరిధిలో తొమ్మిది బీచ్ లలో సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేధించాలని ఆదేశించారు. ఆ మేరకు సదరు పంచాయతీ సమావేశాలలో తీర్మానం చేయాలన్నారు. బీచ్ లు కొనసాగే పంచాయతీలలో దుకాణాలకు, వాహనాల పార్కింగ్‌కు ధరలు నిర్ణయిస్తూ తీర్మానం చేయాలన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా వసూలు చేసే నగదును బీచ్‌ల పరిశు భ్రతకు వినియోగించాలన్నారు. సమావేశంలో డిపిఓ ప్రభాకర్ రావు, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ అనంతరాజు, డిఎల్‌డివోలు, ఎంపీడీవోలు, గ్రామ కార్యదర్శిలు పాల్గొన్నారు.

రైతులను దగా చేస్తున్న పాలకులు

- వ్యవసాయంపై పాలకులు స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలి
- ఎగుమతి, దిగుమతి సుంకాలను సవరించాలి
- రైతు సమస్యలపై సంయుక్త కిసాన్ మోర్చా ఆందోళనకు పిలుపు



మాట్లాడుతున్న చుండూరు రంగారావు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

రెండేళ్లుగా వ్యవసాయ పంటలకు గిట్టుబాటు ధర కల్పించక రైతాంగాన్ని దగా చేసిన ప్రభుత్వాలు ఆరేళ్ల కాలంలో ఆత్మ నిర్భరత్ యోజన పేరుతో మేలు చేస్తామని ప్రకటించడం మరో నయవంచనేనని రైతు సంఘాల నేతలు ధ్వజమెత్తారు. సోమవారం నాడు సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో 2026లో రైతులు ఏ పంటలు సాగుచేయాలో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘాల సమన్వయకమిటీ సమావేశం స్థానిక ఎల్‌బిజి భవనంలో జరిగింది. సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరు రంగారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం, రైతు కూలి సంఘ నాయకులు మాట్లాడారు. ఎస్‌కేఎం జిల్లా కన్వీనర్ చుండూరు రంగారావు మాట్లాడుతూ గిట్టుబాటు ధరల కోసం, కార్యాచరణ కోసం సంయుక్త కిసాన్ మోర్చాతో పాటు, వామపక్ష, అభ్యుదయ రైతుసంఘాల ఐక్య కార్యాచరణతో ఆందోళన కార్యక్రమం చేపట్టనున్నట్లు ఆయన ప్రకటించారు. రాజకీయాలను పక్కనపెట్టి రైతు సంక్షేమం కోసం అధికార, ప్రతిపక్ష పార్టీల రైతులు కలసి రావాలని పిలుపునిచ్చారు.

ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లాప్రధాన కార్యదర్శి పమిడి వెంకటరావు మాట్లాడుతూ ప్రభుత్వం మద్దత్తు ధర ప్రకటించి రైతులను ఆదుకోవడానికి సిద్ధంగా లేదని ఆరోపించారు. గిట్టుబాటు ధరలేక 9 కోట్ల టన్నులు శనగలు కోల్డ్ స్టోరేజిల్లో మగ్గుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మొన్నటి వరకు కొనుగోలు చేసిన నల్లబర్లీ కొనుగోలు నిలిపివేయడంతో రైతులవద్ద నిల్వలు పేరుకుపోయాయన్నారు. నల్లబర్లీ సాగు 4 జిల్లాల్లో నిషేధం విధించార న్నారు. లో గ్రేడ్ పొగాకు కొనుగోలు చేయనం దున పొగాకు రైతులు తీవ్రంగా నష్టపోతు న్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు. గిట్టుబాటు ధర లభించే వరకురైతులు సంఘటితంగా ఉద్యమం చేపట్టాలన్నారు. రైతుకూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ లలితకుమారి మాట్లాడుతూ గత రెండేళ్లుగా పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించక ఈ రబీ సీజన్‌లో ఏ పంట సాగు చేయాలో దిక్కుతోచని పరిస్థితిలో రైతులు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆచార్య రంగా కిసాన్ సంస్థ ప్రధాన కార్యదర్శి చుంచు శేషయ్య మాట్లాడుతూ ఎన్ డిఏ ప్రభుత్వం గత 11ఏళ్లుగా వ్యవసాయ రంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టినట్లు దుయ్యబట్టారు. సమావేశంలో రైతు సంఘం నాయకులు ఎంఎస్ సాయి పాల్గొన్నారు.